
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 08.07.2016, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 05 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## దేవాలయాల ఘటనపై...

# వైకాపా వైఫల్యం



- ఇంకా రాజకీయం వంటబట్టని జగన్
- సెంటిమెంట్‌ను చేజిక్కించుకోలేని నేతలు
- విజయవాడ ఘటనపై సకాలంలో స్పందించి వుంటే పార్టీకి ఎంతో మైలేజీ వచ్చేది


**ఆటల్లో ఒకరి వైఫల్యాలు ఇంకొకరి విజయాలకు సోపానాలు. ఆటయినా రాజకీయమైనా అవతలి వారి వైఫల్యాలను అందిపుచ్చుకుని మన విజయాలుగా మలచుకోవాలి. దీనికి శక్తే కాదు యుక్తి కూడా ముఖ్యమే!**

వైఫల్యాలు పాఠాలు కావాలి. అనుభవాలు గుణపాఠం నేర్పాలి. 2014ఎన్నికల్లో జరిగిన పరాభవాల అనుభవాల నుండి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఇంకా గుణపాఠం నేర్చుకున్నట్లు లేదు. అదే నిర్లిప్తధోరణితో వుంది.

ఇప్పుడు రాష్ట్రంలో వై.యస్ సానుభూతి లేదు. జగన్ గాలి అంతకన్నా లేదు. రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ బ్రతికి బట్టకట్టడం ఒక్క చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాల మీదనే ఆధారపడి వుంది. ప్రభుత్వ వైఫల్యాలను అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోవడంలోనే ప్రతిపక్షం మనుగడ ఆధారపడి వుంటుంది.

విజయవాడలో ఇటువంటి అవకాశమే వైకాపాకు వచ్చినా, దానిని రాజకీయ ప్రయోజనాస్త్రంగా మలచుకోవడంలో ఆ పార్టీ పూర్తిగా విఫలమైంది. కృష్ణకు 12ఏళ్లకోసారి పుష్కరాలు వస్తాయి. ఈ పుష్కరాల కోసమని ఎన్నో ఏళ్లుగా విజయవాడలో వున్న 45 పురాతన దేవాలయాలను అధికారులు కూలగొట్టారు. ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సారథ్యంలో గుళ్లు నేలమట్టమయ్యాయి. సాధారణంగా గుళ్లను తొలగించేందుకు ఒక ఆచారం, పద్ధతి ఉంటుంది. ఈ ఆచారాలేవీ పాటించకుండా కాలువ కట్టల మీద గుడిసెలను తొలగించినట్లుగా గుడులను తొలగించారు. దేవతామూర్తుల విగ్రహాలను ట్రాక్టర్లలో వేయడం, రోడ్డు మీద పడేయడం... టీవీలలో, పత్రికలలో ఈ దృశ్యాలు చూసి హిందువులు భగ్గుమన్నారు. బీజేపీ, ఇద్దరు మంత్రులు ఈ గుడుల కూల్చివేతకు అండగా నిలిచారు. పార్టీ రాష్ట్ర నాయకులు రంగంలోకి దిగి ఇదేమని నిలదీసే సరికి గాని ప్రభుత్వం, మంత్రులు దారికి రాలేదు.

అయితే ఈ మొత్తం ఎపిసోడ్‌లో వైఫల్యం చెందింది వైకాపానే! గుళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా బీజేపీ నాయకులు, సాధువులు, విహెచ్‌పి కార్యకర్తలు ఆందోళనకు దిగారు గాని ప్రతిపక్షంగా వైకాపా నాయకులు ఈ దుశ్చర్యను ఖండిస్తూ విజయవాడ రోడ్ల మీదకు రాలేదు. పద్ధతి, పాడు లేకుండా దేవాలయాల కూల్చివేతపై ప్రతిపక్ష వైకాపా పెద్దఎత్తునే ఆందోళన చేసి ఉండొచ్చు. ముందుగా ప్రతిపక్ష నేత జగనే అక్కడ దిగాలి. పరిస్థితులను పరిశీలించి వుండాలి. వీళ్లు ఈ పని చేసుంటే వైకాపా మీదున్న ఒక మతవాద బ్రాండ్ పోయి హిందువులలో వైకాపాకు పూర్తి దూరంగా వున్న కొన్ని వర్గాలు దగ్గరయ్యే అవకాశం ఉండేది. చంద్రబాబు చేజేతులా ఇచ్చిన అవకాశాన్ని జగన్ చేజేతులా జారవిడిచాడు.





## చంద్రుడి చాణక్యంతో...

# తప్పిన కులసమరం

**రాజకీయాలలో ఓర్పే కాదు, నేర్పు కూడా చాలా ముఖ్యం. పొరపాట్లు, తప్పులు చేయడం మానవ నైజమే అయినా వాటిని తెలుసుకుని వెంటనే సరిదిద్దుకోవడం నాయకుల లక్షణం. ఇలాంటి లౌక్యం, చాణక్యం తెలుసు కాబట్టే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా నిలదొక్కుకోగలుగుతున్నాడు.**

విజయవాడ దేవాలయాల కూల్చివేత వ్యవహారంలో చంద్రబాబు లౌక్యంగా వ్యవహరించకపోయివుండుంటే ఇప్పటికే విజయవాడ కేంద్రంగా రాష్ట్రంలో కుల ఘర్షణ(కాపు, కమ్మ) మొదలై వుండేది. విజయవాడలో జరిగిన దేవాలయాల విధ్వంసమంతా చంద్రబాబు డైరెక్షన్‌లోనే జరిగుంటుంది? ఆయన భరోసా ఇవ్వకుంటే ఎంపీ కేశినేని, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, కలెక్టర్ అహ్మద్‌బాబు, కమిషనర్ వీరపాండియన్‌లు అంత ఓవరాక్షన్ చేయలేరు. హిందువులు గౌరవించే స్వామీజీలపై కేశినేని నాని అంత విమర్శలకు దిగలేడు. బాబు ఉన్నాడులే అనే ధైర్యంతోనే వాళ్లు అంత వీరంగం సృష్టించారు.

దేవాలయాల విధ్వంసానికి వ్యతిరేకంగా బీజేపీ, హిందూ సంస్థలు ఆందోళనకు దిగినా అది పెద్ద ప్రభావం చూపలేదు. అయితే బీజేపీ తరపున కాపు నేతలు రంగంలోకి దిగడం వారితో కేశినేని నాని, బుద్దా వెంకన్నలు గొడవకు దిగడం కథను మలుపు తిప్పింది. బీజేపీ రాష్ట్రమంత్రులనే లెక్కచేయని చంద్రబాబు, ఆ పార్టీ ఆందోళనలను (మిగతా 11వ పేజీలో)

# హిందుత్వానికి వెలుగులు నింపిన సమతామూర్తి భగవత్ రామానుజాచార్యులు

**- శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జియ్యర్ స్వామి**

**సమసమాజ స్థాపనకు కృషి చేసి జగతికి వెలుగుబాటలు నింపిన సంఘసంస్కర్త, సమతామూర్తి భగవత్ రామానుజాచార్యులు వెయ్యేళ్ళ క్రిందటే వెలిగించిన సమతాస్ఫూర్తి మంత్రాన్ని నలుదిశలా వ్యాపింప జేయాలని పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జియ్యర్ స్వామి తెలిపారు.**

భగవత్ రామానుజుల వారి సహస్రాబ్ది సందర్భంగా ప్రముఖదాత, ఆధ్యాత్మికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతుల నేతృత్వంలో ఈ నెల 5వ తేదీ నెల్లూరు గొలగమూడిరోడ్డులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సదస్సు భక్తి పారవశ్యంతో వెల్లివిరిసింది. భక్తులు వేలాదిగా తిరునామం దిద్దుకుని ఆశీనులయ్యారు. ఆధ్యాత్మిక సదస్సులో స్వామీజీ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ హింసకు తావులేనిదే నిజమైన దైవభక్తని, మన జీవన విధానాలు వేరైనా మనమంతా ఒకే కుటుంబం, భగవంతుని బిడ్డలం అని అన్నారు. రామానుజుల వారు జన్మించి 2017 నాటికి 1000 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా భగవత్ రామానుజుల వారి సమతామూర్తి స్ఫూర్తి కేంద్రాలను రెండు తెలుగు రాష్ట్రాలలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. (వార్త 3వ పేజీలో)



# అపాచీ ఆటో పంచాయితీ!

**ఆర్టీసీ బస్సులు కావాలి... అద్దెలు కట్టరంట!**

**సూళ్లూరుపేట సమీపంలోని 'అపాచి' సెజ్‌లో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరు ఫ్యాక్టరీలో బ్రతుకుతెరువు కోసం పని చేస్తూ, ఫ్యాక్టరీకి వచ్చేటప్పుడు, తిరిగి ఇళ్లకు వెళ్లేటప్పుడు మాత్రం బ్రతుకును పణంగా పెట్టి హైవే మీద ప్రయాణం చేస్తున్నారు. ఎందుకంటే ప్రయాణించేది ఆటోలలో.**

ఒక్కో ఆటోలో నిబంధనల ప్రకారం ముగ్గురే ప్రయాణించాలి. ఇక్కడి ఆటోలలో మాత్రం 15మందికి తక్కువ వుండరు. అపాచీ ఫ్యాక్టరీ నుండి నాయుడుపేట వరకు హైవే మీద కార్మికులతో నిండిన ఆటోలు రేస్ గుర్రాల్లా దూసుకుపోతుంటాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో కార్మికులు షిఫ్ట్ ముగించుకుని వెళ్లేటప్పుడు జాతీయ రహదారి మీద దాదాపు వందల ఆటోలు ఒకదాని వెనుక ఒకటి, ఒకదాని పక్కనొకటి... ర్యాలీగా పోతూ వెనుకవచ్చే వాహనాలకు చాలా ఇబ్బందిగా వుంటోంది. రాత్రి వేళల్లో ఆటోల మూలంగా జరగరానిది జరిగితే ప్రాణనష్టం తీవ్రంగానే




ఉంటుంది. ఈ సమస్యను చాలాకాలం క్రితమే 'లాయర్' వెలుగులోకి తెచ్చింది. ఇటీవల జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టిపెట్టిన ఎస్పీ అపాచీ కార్మికుల ఆటోప్రయాణం గురించి తెలుసుకున్నారు. కార్మికులకు ఆటోలు కాకుండా బస్సులు ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. అపాచీ ఫ్యాక్టరీ చైనావాళ్లది. ఇసుక నుండి నూనెను పిండే రకం వాళ్లు. కార్మికుల చేత గొడ్డు చాకిరి చేయించుకుని చాలీచాలని జీతాలిస్తుంటారు. సొంతంగా సంస్థకు బస్సులు పెడితే ఖర్చు ఎక్కువవుతుం దని భావించి ఆర్టీసీ అద్దె బస్సులను మాట్లాడుకోవాలనుకున్నారు. ఎవరైనా అద్దె బస్సులంటే ట్రిప్పుకింతని, లేదంటే నెలకు ఇంతని మాట్లాడుకుంటారు. కాని అపాచీ వాళ్లు మాత్రం ఆర్టీసీ అధికారులకు వెరైటీ ప్రతిపాదన పంపారు. తమ కార్మికులందరికీ 20రోజుల పాస్‌లు తీసిస్తామని, వారి కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేకంగా బస్సులు నడపాలని కోరినట్లు తెలుస్తోంది. దీనిని ఆర్టీసీ అధికారులు తోసిపుచ్చారు. ఇలా నడిపితే మాకు నష్టం తప్ప లాభం లేదని, మేం బస్సులు ఇవ్వలేమని అపాచీ వారికి చెప్పినట్లు సమాచారం. అపాచీ వాళ్లకు ఆదాయాల మీదున్న శ్రద్ధ కార్మికుల భద్రతపై లేకపోవడం విచారకరం.

## జిల్లా జడ్జిగా జునైబ్ అహ్మద్

నెల్లూరుజిల్లా జడ్జిగా మౌలానా జునైబ్ అహ్మద్‌ను నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రెండు నెలల క్రితం ఇక్కడ న్యాయమూర్తిగా వున్న సిహెచ్ దుర్గారావును చిత్తూరుజిల్లా జడ్జిగా బదిలీ చేశారు. అప్పటి నుండి ఈ పదవి ఖాళీగా వుంది. గుంటూరు మూడో అదనపు జిల్లా జడ్జిగా పనిచేస్తున్న అహ్మద్‌ను పదోన్నతిపై నెల్లూరుజిల్లా జడ్జిగా బదిలీ చేశారు.

## కురుగొండ్లకు సన్మానం

విదేశీ పర్యటనను ముగించుకుని వెంకటగిరికి వచ్చిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. గత నెల లండన్‌కు వెళ్లిన ఎమ్మెల్యే రామకృష్ణ దంపతులు విమానంలో చెన్నైకు చేరారు. అక్కడి నుండి వెంకటగిరికి వస్తున్న ఆయనకు తడ వద్ద నాయకులు స్వాగతం పలికారు. సూళ్లూరుపేట వద్ద మునిసిపల్ ఛైర్‌పర్సన్ దొంతు శారద, ఉపాధ్యక్షుడు బీరం రాజేశ్వరరావు, టిడిపి కార్యనిర్వాహణ కార్యదర్శి పుల్లుకొల్లు రాజేశ్వరరావు, కౌన్సిలర్లు, నాయకులు స్వాగతం పలికారు. వెంకటగిరి క్రాస్‌రోడ్డు సెంటర్‌లో మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ ఎన్‌డివి ప్రసాద్‌నాయుడు, బాలాయపల్లి, డక్కిలి మండలాలకు చెందిన నాయకులు గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ యువత అధ్యక్షుడు కె.వి.కె.ప్రసాద్, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సుధాకర్, చంద్రారెడ్డి, గంగాధర్, బాలకృష్ణ, జడ్పీటీసీ సభ్యులు గుర్నాధం, రామచంద్రయ్య, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

## వెంగమాంబ ఆదాయం 48.86 లక్షలు

నెల్లూరుజిల్లా దుత్తలూరు మండలం నర్రవాడలో గత నెల 26 నుంచి 30వ తేదీ వరకు జరిగిన వెంగమాంబ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి రూ.48,86,448లు ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 2వ తేదీన దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆలయంలో హుండీలతో పాటు వివిధ మార్గాల ద్వారా వచ్చిన నగదును లెక్కించారు. హుండీల ద్వారా రూ. 28,65,525లు, దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 7,53,470లు, తలనీలాలు టిక్కెట్ల ద్వారా రూ. 22,560లు, కళ్యాణం, చదివింపులు ద్వారా రూ. 32,708లు ఆదాయం వచ్చింది. గత యేడాదికంటే 10లక్షలు ఆదాయం అధికంగా వచ్చిందని అధికారులు తెలిపారు.


## వింజమూరు గ్రామపంచాయతి కార్యాలయము

**శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా.**

**ఆర్.ఓ.సి.నెం.6/2016** **తేది.30.06.2016**

### టెండరు ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వింజమూరు మండలం, వింజమూరు గ్రామ పంచాయితీలో కాంట్రాక్టు పద్ధతిపై తే.01.07.2016ది నుండి తే.30.06.2017ది వరకు ఒక(1) సంవత్సర కాలమునకు ఈ క్రింద కనుపరచిన ప్రకారము వివిధ రకముల సేవలు అందించుటకు గాను వింజమూరు గ్రామ పంచాయితీలో తే.09.07.2016దిన ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు టెండర్లు స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లను అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. టెండరు దాఖలు చేయుటకు ఆసక్తిగలవారు ఆయా వివరములకు ఎదురుగా చూపబడిన ధరావత్తు రుసుమును చెల్లించి టెండర్లు దాఖలు చేయవలయును. ఇతర వివరములు పంచాయితీ కార్యాలయము పనిచేయు వేళలలో పంచాయితీ కార్యదర్శిని అడిగి తెలుసుకొనవచ్చును.

| వ.నెం. | వివరములు | సిబ్బంది సంఖ్య | ధరావత్తు రూ.లలో |
|---|---|---|---|
| 1. | పారిశుద్ధ్య పనుల నిర్వహణకు | 22 (ఇరవై రెండు మంది) | రూ. 200/- ఒకొక్కరికి విడివిడిగా |
| 2. | మంచినీటి సరఫరా నిర్వహణకు | 4 (నలుగురు) | " |
| 3. | వీధి విద్యుత్ దీపములు నిర్వహణకు | 2 (ఇద్దరు) | " |
| 4. | ట్రాక్టర్ డ్రైవర్ | 1 (ఒకరు) | " |
| 5. | పంపు ఆపరేటర్లు | 12 (పన్నెండు) | రూ. 50/-లు (ఒక్కొక్కరికి విడివిడిగా) |

నోట్ : 1) అనివార్యకారణముల వలన ప్రభుత్వము వారు టెండరు నిర్వహించు తేదీని సెలవు దినముగా ప్రకటించిన యెడల మరుసటి కార్యాలయ పని దినమున టెండర్లు స్వీకరించబడును.
2) టెండర్లను పాక్షికంగా గాని, పూర్తిగా గానీ రద్దు పరచుటకు లేదా వాయిదా వేయుటకు లేదా నిలుపుదల చేయుటకు పంచాయితీ కార్యదర్శి వారికి అధికారము కలదు.

**సం/- కె.రామారావు**
**పంచాయతీ కార్యదర్శి, వింజమూరు గ్రామపంచాయతి**
**శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా.**


## సంక్షేమ పథకాల్లో 'సిండికేట్' ముందంజ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి పేద, బలహీనవర్గాల వారికి ఆర్థిక సహాయం అందించడంలో సిండికేట్ బ్యాంక్ విశిష్ట సేవలు అందిస్తుందని ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్ మంజునాథ్ పేర్కొ న్నారు. సోమవారం నెల్లూరులోని టూరిజం హరిత హోటల్లో నెల్లూరు, చిత్తూరు సిండికేట్ బ్యాంక్ అధికారులతో జరిగిన రిటైల్ రుణ వితరణ మరియు అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రధానంగా సిండికేట్ బ్యాంక్ పేద, బలహీన వర్గాల వారికి చిన్న, సన్నకారు రైతులకు మరియు చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఔత్సాహికులకు అవసరమైన ఆర్థిక సహాయం అందించి వారి అభివృద్ధికి సహకరించడం జరుగుతుందన్నారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉన్నత చదువులు కొరకు సిండికేట్ బ్యాంక్ వీలైనంత విద్యా ఆర్థిక సహాయం అందించ డంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. సిండికేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరసింహమూర్తి మాట్లాడుతూ వివిధ




రకాలైన రుణాలు ఖాతాదారులకు అందించినప్పుడు ఆ రుణాలు దేనికొరకైతే తీసుకోవడం జరుగుతుందో ఆ విధంగా సద్వినియోగం చేసుకొని తీసుకున్న రుణాలను మరలా జమచేసేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో చీఫ్ జనరల్ మేనేజర్లు విజయకుమార్, శ్రీమతి రాజ్యలక్ష్మి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన సిండికేట్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

### కలెక్టరేట్
## నిర్మాణంపై కదలిక

నెల్లూరు దర్గామిట్టలోని క్షయ ఆసు పత్రి ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన కొత్త కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. సువిశాల ప్రాంగణంలో 35కోట్ల అంచనాతో, అత్యంత ఆధునికంగా నిర్మించతలపెట్టిన కలెక్టరేట్ నిర్మాణానికి ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో ఆన్‌లైన్ టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

### బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్‌పై
## వేటు పడింది

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లోని బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు 2వ తేదీ ఉత్త ర్వులు విడుదల చేశారు. టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్‌ను తప్పుదోవ పట్టించినందుకుగాను ఈ వేటు పడింది. నెల్లూరు నగరంలో అక్రమ కట్టడాలపై ప్రత్యేకబృందాలు నియమించి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ తన వార్డుల్లో ఉన్న భవంతుల వివరాలు వారికి చెప్పాల్సి వుంది. అయితే మండపాలవీధిలో ప్లానుతో సంబంధం లేకుండా అదనంగా అంత స్తులు నిర్మించి వున్న విషయాన్ని బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌కుమార్ డైరెక్టర్ దృష్టికి తీసుకురాకుండా దాచిపెట్టాడు. అదీగాక, సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అక్రమ కట్టడాలపై సరైన సమాచారం ఇవ్వనం దుకు ప్రవీణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవా లని కమిషనర్‌కు సిఫార్స్ చేశారు. ఈ మేరకు ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు.

## గ్రామాల బాగు కోసం కృషి

నెల్లూరు రూరల్ మండలంలోని వివిధ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి ఆయా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని మాజీ మంత్రి, నెల్లూరు రూరల్ నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకరరెడ్డి అన్నారు. ఈనెల 3న ఆయన నెల్లూరురూరల్ మండలంలోని ఆమంచర్ల గ్రామంలో 30లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నీరు-చెట్టు పథకంలో 9 కోట్లు, మరో 5 కోట్ల ప్రత్యేక నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఆనం జయకుమార్‌రెడ్డి, నాయకులు హరిబాబుయాదవ్, మలినేని వెంకటేశ్వర్లునాయుడు, కిలారి వెంకటస్వామినాయుడు, రాగసనాయుడు, సర్పంచ్ మంజుల, ఎంపిటిసి సభ్యులు అనసూయమ్మ కార్పొరేటర్లు మల్లిబోయిన వెంకటేశ్వర్లుయాదవ్, సయ్యద్ సమీ, ఖాజావలి, స్వర్ణా వెంకయ్య, ఎంపిడిఓ వసుమతి తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్ ఉద్యోగుల నూతన కార్యవర్గం

ఏపి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఈనెల 3న స్థానిక జడ్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్ను కున్నారు. అసోసియేషన్‌కు అధ్యక్షునిగా ఎన్. వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షునిగా కె. లక్ష్మీనరసింహం, ఉపాధ్యక్షునిగా వి. రామమనోహరరెడ్డి, కార్యదర్శిగా ఆమోస్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా కె.నాగేంద్రబాబు ఎన్నికయ్యారు. అదేవిధంగా, ఆర్గనైజింగ్ కార్య దర్శులుగా ఎం.దేవీప్రసాదరావు, మునిరామయ్య, ఆర్.భారతి, కె.వెంకటేశ్వర్లు, ఎస్‌కె కాలేషా, జి.శ్రీధర్‌మోహన్, కె. జనార్దనరావు, కోశాధికారిగా ఎల్.పెంచలయ్య ఎన్ని కయ్యారు. జేసిని సభ్యులుగా ఏ.వి సుబ్బారావు, ఏ. భవ్యజ్యోతి, రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా కె. వెంకటాద్రి, టి.గోపీనాథ్, శ్రీనివాసరావు, వి. రజనీకాంత్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా గుల్జార్‌బేగం, పరిశీలకునిగా టి.రమేష్‌బాబు వ్యవహరించారు.

## బ్యాంకులో అగ్నిప్రమాదం

మంగళవారం కృష్ణపట్నం పోర్టులోని ఐడిబిఐ బ్యాంకులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడి రికార్డులు, కంప్యూటర్లు, ఫర్నీచర్ దగ్ధమైంది. దాదాపు 50లక్షల రూపాయలు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. పోర్టు అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. స్ట్రాంగ్ రూమ్‌లోని నగదు, నగలు భద్రంగానే ఉండడంతో బ్యాంకు సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.



# హిందుత్వానికి వెలుగులు నింపిన సమతామూర్తి భగవత్ రామానుజాచార్యులు

ప్రపంచంలోనే గొప్ప ఆథ్యాత్మిక స్ఫూర్తి కేంద్రంగా రామానుజ స్మారక ప్రాంగణాన్ని రూ. 1000 కోట్లతో అందరి భాగస్వామ్యంతో నిర్మించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. నేటితరంతో పాటు భావితరాలకు స్ఫూర్తి కేంద్రమైన ఈ నిర్మాణంలో ప్రతిఒక్కరు తమ సంపాదనలో కొంత విరాళంగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. నెల్లూరులో భక్తుల మధ్యలో కూర్చుని మాట్లాడే అవకాశం కల్పించిన ఆథ్యాత్మిక వేత్తలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి రెడ్డిలు ధన్యజీవులని కొనియాడుతూ మంగళాశాసనాలు అందజేశారు.

తొలుత స్వామీజీ సీతాలక్ష్మణ హనుమ సహిత శ్రీరామచంద్రుడికి గోదాదేవి, శ్రీకృష్ణుడు, శ్రీ వేంకటేశ్వరస్వామి, నరసింహస్వామి, శ్రీ భగవద్రామానుజులు, విశేష అలంకారం, మంగళశాసనం, శాత్తుమూరై నిర్వహించారు. అనంతరం భక్తులకు తమ స్వహస్తాలతో తీర్థం పంపిణీ చేశారు. జ్యోతిప్రకాశం అనంతరం మాట్లాడుతూ హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో చిన్నజీయర్ స్వామి ఏర్పాటు చేయదలచిన శ్రీ సమతామూర్తి కేంద్రంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై చేయూతనందించాలని కోరారు. 216 అడుగుల శ్రీ భగవత్ రామానుజాచార్యుల లోహమయ మూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కులం, మతం, జాతి, ఆస్తి, చదువు ఇవన్నీ మనిషి బలహీనతలన్నారు. వీటిని ఉపయోగించుకునే కుల వివక్షతలు, మత విశ్వాశాలు చెలరేగుతున్నాయన్నారు. పరమాత్ముడు ఓ మహాసముద్రం లాంటి వాడని, అందులో ఏదైనా తేలిగ్గా మునిగిపోగలదన్నారు.

రాష్ట్రం రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయినందున విజయవాడ అమరావతి విజయ కీలాద్రి పర్వతంపై కూడా 108 అడుగుల ఎత్తున శ్రీరామానుజ స్వామి విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. సమతా సందేశాన్ని అందించిన రామానుజాచార్యులకు మనం ఎంత చేసినా తక్కువేనన్నారు.

### భక్తిభావాన్ని ప్రభోదించిన గజల్ గీతాలు

చిన్నజియర్ స్వామి ప్రవచనాలకు ముందు ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ ఆలపించిన భక్తి గీతాలు భక్తులను మైమరపించాయి. గజల్ శ్రీనివాస్ పాడుతున్నంత సేపు భక్తులు పరవశంతో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, తుంగా శివప్రభాత్‌రెడ్డి, రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, తోట మనోహర్, వాకాటి విజయకుమార్ రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, గ్రోసు గోపాలయ్య, కె.వి.రత్నం, మైథిలి మనోహర్‌రెడ్డి, ఆల్తూరు ఆదినారాయణరెడ్డి, పలు దేవాలయాల ఇఓలు, ఛైర్మెన్లు, ఆనం రంగమయూర్‌రెడ్డి, సి.వి. సుబ్రహ్మణ్యం, తుమ్మల సుబ్బారెడ్డి తదితరులతో పాటు వాత్సల్య, ప్రగతి ఛారిటీస్, కృష్ణచైతన్య విద్యార్థులు పాల్గొని స్వామి ఆశీస్సులు అందుకున్నారు. విజయ్ సారధ్యంలోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ సిబ్బందితో పాటు సత్యసాయి సేవా సమాజం సుధాకర్, కళాంజలి అనంత్, ఇతర ఆథ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య సంస్థల సహకారంతో ఈ ఆథ్యాత్మిక సదస్సు అత్యంత వైభవోపేతంగా జరిగింది.

## విరివిగా విరాళాలు

సమతామూర్తి కేంద్రం నిర్మాణానికి భక్తులు భారీగా విరాళాలు అందజేశారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి భూరి విరాళాన్ని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే జె.కె.రెడ్డి రూ.5లక్షలు, వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి రూ.లక్షా నూటపదహార్లు, వేమిరెడ్డి సోదరి శశికళ రూ.1లక్ష, మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ ఎండి వీరిశెట్టి హజరత్‌బాబు రూ. 50,116, 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి రూ. 25,111లు, నలుబోలు బలరామయ్యనాయుడు రూ. 2,116లు తదితరులు విరాళాలను అందజేశారు. ఆ స్ఫూర్తి మందిరంలో నిత్యారాధనకు 120కిలోల బంగారు విగ్రహానికి గాను ఇద్దరు అజ్ఞాత భక్తులు 4బంగారు గాజులు, మోహన్‌రావు అనే భక్తుడు 12బంగారు పుష్పాలు అందజేశారు. భక్తులు అందజేసే బంగారు నేరుగా స్వామివారి 120 కిలోల విగ్రహం కోసం వినియోగింపబడుతుందని, సృష్టి వున్నంత కాలం ఆ విగ్రహానికి నిత్యపూజలు, ఆరాధనలు జరుగుతాయని స్వామి చెప్పారు.










# విద్యతోనే... విశ్వవిజేతలు కాగలరు

**- విపిఆర్ విద్యలో స్వామీజీ**



మానవ మేధస్సుకు కావలసింది కేవలం అక్షరాస్యత కాదని, జ్ఞానాన్ని పెంపొందించే పరిపూర్ణ విద్య అని శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ జియ్యర్ స్వామి అన్నారు. విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన "ఆథ్యాత్మిక సదస్సు"లో పాల్గొన్న అనంతరం ఆయన విపిఆర్ విద్యను సందర్శించారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన పాఠశాల వసతులను చూసి ఆయన ఆశ్చర్యపోయారు. విపిఆర్ ఫౌండేషన్ చేస్తున్న ప్రయత్నానికి హృదయపూర్వకంగా ప్రభాకర్‌రెడ్డి దంపతులను అభినందించారు.

ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సామాన్యుడికి అసామాన్య విద్య అందిస్తున్న ప్రభాకర్‌రెడ్డి ఎంత పుణ్యాత్ముడో, ఆయన అందిస్తున్న ఉచిత విద్యను అత్యున్నత ప్రమాణాలతో అందుకుంటున్న విపిఆర్ విద్య విద్యార్థులు కూడా అంతే అదృష్టవంతులని అన్నారు. నిస్వార్థంతో రేపటి తరం కోసం ప్రభాకర్‌రెడ్డి అందిస్తున్న విద్య ద్వారా ఇక్కడ చదువుకున్న పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే విపిఆర్ ప్రయత్నానికి పరిపూర్ణ సార్ధకత లభిస్తుందన్నారు. చదువు అందించడమే లక్ష్యంగా కాకుండా నాణ్యతతో కూడిన చదువును ఇవ్వగలిగిన నాడే రేపటి తరం బంగారు భవిష్యత్తుకు మనం బలమైన పునాదులు వేసిన వాళ్ళమౌతామని జీయ్యర్ స్వామి అన్నారు. దాదాపు అరగంటసేపు విపిఆర్ విద్య చిన్నారులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. చమత్కారవంతమైన భాషణతో పిల్లల మనసులు దోచుకున్నారు. వి.పి.ఆర్ ఫౌండేషన్ పక్షాన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు స్వామికి ప్రాంగణంలోకి సాదరంగా ఆహ్వానం పలుకగా ఫౌండేషన్ గౌరవ సిఇఓ ప్రొఫెసర్ నారాయణరెడ్డి స్వామివారిని వేదికపైకి సవినయంగా ఆహ్వానించి కార్యక్రమాన్ని నిర్వహించారు. విపిఆర్ విద్య ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో పాటు అధ్యాపక సిబ్బంది, విపిఆర్ వైద్యం బృందంతో పాటు ఇతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థినీ విద్యార్థులందరినీ స్వామివారు స్వయంగా ఆశీర్వదించి ప్రసాదాన్ని అందజేశారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాన్ని ఆయన పదేపదే అభినందించడం గమనార్హం.







## 'ప్రభా'తం

# ఉగ్రభూతం.. 'విశ్వ'రూపం

**ఇరాక్ రాజధాని బాగ్దాద్...బాంబుల పేలుళ్ళతో దద్దరిల్లిపోయింది**
**ఆత్మాహుతి దళాల పేలుళ్ళతో అక్కడున్న షాపింగ్‌మాల్ పేలిపోయింది.**
**మొత్తం..131 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు.**
**వందలాదిమంది ప్రజలు తీవ్ర గాయాల పాలయ్యారు.**
**మృతుల్లో 15 మంది చిన్నపిల్లలు కూడా వున్నారు.**
**ఢాకాలోనూ..రక్తం ఏరులై పారింది.**
**అనేకదేశాల్లో ఉగ్రవాదరక్కసి ఇలా వికృతనాట్యం చేస్తూనే వుంది.**

**ఇటీవల బాగ్దాద్‌లోనూ, ఢాకాలోనూ దారుణ మారణకాండలతో ప్రపంచాన్నే భయకంపితుల్ని చేసిన ఉగ్రవాదచర్యలను ప్రపంచప్రజలంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. సకల మానవాళికీ ప్రమాదకరంగా పరిణమించిన ఈ ఉగ్రవాద విషసర్పంపై ప్రపంచవ్యాప్తంగా ఉమ్మడి పోరుకు సిద్ధం కావడమే ప్రపంచదేశాలన్నిటి తక్షణ కర్తవ్యం. కత్తులు నూరి.. కుత్తుకలుత్తరించేవారికి తగ్గ గుణపాఠం చెప్పి, తద్వారా విశ్వశాంతిని పరిరక్షించుకోవాలి. అందుకు ప్రపంచప్రజలంతా తక్షణం సమాయత్తం కావాలి.**



ప్యారిస్, బ్రస్సెల్స్.. ఇస్తాంబుల్.. ఢాకా.. బాగ్దాద్..తదితర దేశాల్లోని అనేక నగరాలు ఇప్పుడు ఉగ్రవాద రక్కసిమూకల ధాటికి గజగజ వణికిపోతున్నాయంటే అతిశయోక్తేమీ కాదు. ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థ ప్రపంచంపై విషం కక్కుతోంది. ప్రపంచవ్యాప్తంగా మారణకాండల్ని సృష్టిస్తూ..చివరికి మానవాళి మనుగడనే ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రపంచంలోని అన్నిదేశాలకూ ఇప్పుడు ఈ పెనుప్రమాదమే పొంచి ఉంది. ప్రజలపై భీతావహ దాడులు చేయడం, గొంతులు కోయడం, అమాయకులను చంపడం.. భవనాలు పేల్చడం.. తుపాకులు-బాంబులతో కాల్చడం, ఆత్మాహుతి దళాలుగా మారి రాక్షస కాండలు సృష్టించడం వంటి పైశాచిక చర్యలతో ప్రపంచాన్ని వణికిస్తోంది.

మొన్నటికి మొన్న ఢాకాలో ఓ బేకరీని చుట్టుముట్టిన ఉగ్రవాదులు, అందులో వున్న 20 మంది విదేశీయుల గొంతులు పట్టుకుని.. వారి పీకలు తెగ్గోసి వికటాట్టహాసం చేశారు. వీరు అసలు మనుషులేనా?... కాదు.. రాక్షసమూకలు. మానవత్వమన్నది ఏ కోశానా లేని పిశాచులు..నరహంతకులు. అభం శుభం తెలియని అమాయక ప్రజలను, స్త్రీలను, చిన్నపిల్లలని కూడా కనికరం లేకుండా నిర్దయగా.. అత్యంత ఘోరంగా గొంతులు కోసి చంపే నీచులు.. నరరూప రాక్షసులు..పైశాచికత్వానికిది పరాకాష్ఠ. మానవత్వం వున్న మనిషెవడూ వీటిని సహించలేడు. మానవజాతి చరిత్రలోనే లేనట్టి ఇంత వికృతమైన..ఇంత పైశాచికమైన నరమేధాలకు పాల్పడుతున్నవారిని చివరికి ఆ దేవుడు కూడా క్షమించలేడు. అందులోనూ పరమపవిత్రమైన రంజాన్‌మాసంలో, ఎంతో శాంతియుతమైన ఆ మతం పేరును అడ్డుపెట్టుకుని, ఉగ్రవాదులు ఇలా దారుణమారణహోమాలు సాగిస్తూండడం మరింత దారుణం. అయినా..మతాలు, భాషలు..దేశాలు.. ప్రాంతాలు అనే తేడాలేమీ ఉగ్రవాదులకు వుండవని, వారికి కావాల్సింది రాక్షసకాండలేనని ఈ మారణకాండలు నిరూపిస్తున్నాయి. ఇటీవల బంగ్లాదేశ్, బాగ్దాద్‌లలో జరిగిన ఉగ్రవాదుల పైశాచికచర్యలు ఈ విషయాన్ని చెప్పకనే చెప్తున్నాయి.

ఇరాక్‌లో జరిగి న మారణకాండలో ప్రాణాలు కోల్పోయిన 150 మందిలో 112 మంది రంజాన్ సందర్భంగా షాపింగ్‌మాల్‌కు విచ్చేసిన ప్రజలు.. వారంతా సామాన్య పౌరులే. అయినా, ఉగ్రవాద రక్కసికి ఎవరేమైపోయినా పర్వాలేదు. తమకు కావాల్సింది నరమేధాలే. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని ఉగ్రవాదులు ఇలా తమ కిరాతకత్వానికి పొట్టనబెట్టుకుంటూనే వున్నారు. ఇలాంటి నరరూప రాక్షసులైన ఉగ్రవాదులకు అక్కడక్కడా ఏదోఒకవిధంగా ఊతమిచ్చేవారంతా కూడా రాక్షసులేనని.. అలాంటివారు కూడా మానవత్వానికి..మానవజాతికి శత్రువులేనని వేరే చెప్పనక్కర లేదు.

ఇటీవల ఢాకా రెస్టారెంట్‌లో జరిగిన మానవ మారణకాండ ఎంత ఘోరమో!.. ప్రపంచవ్యాప్తంగా మానవజాతినే వణికించిందంటే అతిశయోక్తి కాదు. ఉగ్రవాదుల దాష్టీకానికి బలైనవారిలో జపాన్ దేశస్తులు, ఒక భారతీయ విద్యార్థిని తరుషి కూడా వున్నారు. ఎంత బాధాకరమో ఈ ఘటనలు. టర్కీ రాజధాని ఇస్తాం బుల్‌తో ప్రారంభమైన ఈ ఉగ్రవాదుల దాడులు ఢాకాను కూడా బెంబేలెత్తించేశాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో కూడా విధ్వంసాలు సృష్టించేందుకు ముష్కర మూకలు పన్నిన కుట్రను జాతీయ దర్యాప్తు సంస్థ వెంటనే కనుగొని ఆ కుట్రను భగ్నం చేసి అమాయక ప్రజలు ఆ విధ్వంసాల బారిన పడకుండా కాపాడింది. భారత్‌కు కూడా ఈ ఉగ్రవాదుల పెను ముప్పు వుంటుందనే సమాచారంతో భారత్ ఎల్లవేళలా అప్రమత్తంగా వుంటూ భద్రతాచర్యలను ఎప్పటికప్పుడు కట్టుదిట్టం చేస్తూనే వుంది. అయినా, ఉగ్రవాద కిరాతకులు ఇలాంటి మారణకాండలను ప్రపంచవ్యాప్తంగా ఏదో ఒక రూపంలో కొనసాగిస్తూనే వున్నారు. మానవాళి మనుగడకే మహాప్రమాదంగా పరిణమిస్తున్న ఈ ఉగ్రవాద కిరాతకముఠాల దాష్టీకాలకు అంతే లేకుండాపోతోంది. మనప్రధాని నరేంద్రమోడీ పిలుపునిచ్చినట్లుగా..ఉగ్రవాదంపై ఉమ్మడిపోరే శరణ్యం. ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న దేశాలకు, ఉగ్రవాదసంస్థలకు కూడా ఈ పోరు ఒక గుణపాఠం కావాలి. సకల మానవాళికీ ప్రమాదకరంగా పరిణమించిన ఉగ్రవాదంపై ప్రపంచవ్యాప్తంగా ఉమ్మడిపోరుకు సిద్ధం కావడమే ప్రపంచదేశాలన్నిటి తక్షణ కర్తవ్యం కావాలి. కత్తులు నూరి.. కుత్తుకలుత్తరించేవారికి తగ్గ గుణ పాఠం చెప్పకుంటే..ప్రపంచవ్యాప్తంగా మానవాళి పరిస్థితి రానురాను మరింత దయనీయమవుతుంది. ఇలాంటి ఉగ్రవాద ఉన్మత్తచర్యలను.. దారుణ మారణహోమాలను శాశ్వతంగా రూపుమాపేందుకు, ఉగ్రవాదంపై పోరుకు.. తద్వారా విశ్వశాంతిని పరిరక్షించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో ప్రతినబూనడం తక్షణ కర్తవ్యం. ఎల్లజనులూ సుఖశాంతులతో జీవించేందుకు ప్రపంచదేశాలన్నీ ఉగ్రవాదంపై ఉమ్మడిపోరుకు అన్నివిధాలా సమగ్రమైన కార్యాచరణ చేపట్టడం అవసరం. ప్రపంచాన్నే భయపెట్టే ఉగ్రవాదాన్ని సమూలంగా మట్టుబెట్టి.. భూస్థాపితం చేయడమొక్కటే సరైన పరిష్కారమార్గం!....

# 9న జాతీయ లోక్‌అదాలత్

దేశవ్యాప్తంగా జరుగుతున్న లోక్‌అదాలత్‌లో భాగంగా ఈ నెల 9వ తేదీన జిల్లాలో లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు న్యాయసేవ అధికార సంస్థ ఇన్‌ఛార్జి ఛైర్మెన్ కె.శ్యామలాదేవి పేర్కొన్నారు.

2వ తేదీ సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన ఆమె మాట్లాడుతూ జిల్లాలో నగరంతో పాటు ఎనిమిది మండలాల్లో నిర్వహించే లోక్ అదాలత్‌లో విద్యుత్, నీరు, టెలికాం, ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరిస్తామని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే రాజీ ఆమోదయోగ్యమైన సివిల్, క్రిమినల్, కుటుంబ వివాదాలు, మోటారు ప్రమాద వాహన కేసులు, బ్యాంకు, ఫైనాన్స్ సంబంధిత కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వున్న కక్షిదారులు, న్యాయవాదులు, సంబంధిత సంస్థల అధికారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

ఏసిబి కోర్టు న్యాయమూర్తి నరశింహరాజు, సీనియర్ సివిల్ జడ్జి టివి సుబ్బారావు, న్యాయసేవాసంస్థ కార్యదర్శి సత్యవాణి, మెజిస్ట్రేట్ వైజె పద్మశ్రీ, అరుణశ్రీ, పలు సంస్థల అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## శాకాహారం శ్రేయోదాయకం

శాకాహారమే ఆరోగ్యానికి ఎంతో మంచిదని... ఒక్క మాటలో చెప్పాలంటే శాకాహారం అమృతాహారం వంటిదని బుద్ధ హుడ్ పిరమిడ్ ధ్యాన ప్రబోధకుడు ఆనంద కుమార్ అన్నారు. ఆదివారం నెల్లూరులోని ఆ ధ్యాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో ఆ ధ్యాన కేంద్రం మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు మహిళా ఏఎస్ఐలకు ఘన సన్మానం

ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు మహిళా ఏఎస్ఐలను ఈ నెల 3న నెల్లూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఏఎస్ఐ పరమేశ్వరి, హెడ్‌కానిస్టేబుల్ పద్మశ్రీ ఆధ్వర్యంలో ఈ ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. ఇటీవల పదవీ విరమణ పొందిన నాల్గవ నగర మహిళా ఏఎస్ఐ దుర్గాంబ, గతంలో ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్ఐ పుష్పను ఈ కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు.

# లక్ష మొక్కల పెంపకం లక్ష్యం

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో 'వనం కోసం మనం' కార్యక్రమం కింద లక్ష మొక్కలు పెంచేందుకు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు ఆ బ్యాంక్ రీజనల్ మేనేజర్ బివి శివయ్య తెలిపారు. ఈ నెల 3న ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌కు నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో 503 శాఖలు వున్నాయని, ఆయా శాఖల పరిధిలో 2వందల మొక్కల వంతున నాటాలని నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమంలో పొదుపు మహిళలను, ఖాతాదారులను, వ్యాపార ప్రతినిధులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆ బ్యాంక్ సీనియర్ మేనేజర్లు డి.మధుసూదన్, ఎస్.భాస్కరరెడ్డి, డాక్టర్ రామన్, ఆర్గనైజర్ కృష్ణకుమార్; సత్యసాయి తదితరులు పాల్గొన్నారు.

## పెరసం కవి సమ్మేళనం

నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం(పెరసం) ఆధ్వర్యంలో ఈనెల 3న జరిగిన కవి సమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది. శ్రీశ్రీ సాహిత్యం-జీవితంపై పలువురు కవులు తమ కవితలు చదివి వినిపించారు. నగరంలోని జనవిజ్ఞానవేదిక కార్యాలయంలో జరిగిన ఈ కవి సమ్మేళనంలో మోపూరు పెంచల నరసింహం, ఇంద్రగంటి మధుసూదన్, గోవిందరాజుల సుభద్రాదేవి, గుండాల నరేంద్రబాబు, పేరం అన్నపూర్ణ తదితర కవులు, కవయిత్రులు పాల్గొన్నారు.

## చంపమని దేవుడు చెప్పాడా?

మానవ హననాన్ని ఇస్లాం ఆమోదించదు. జాలి, దయ, ప్రేమ, దానం వంటి సద్గుణాలు మాత్రం ఇస్లాం బోధిస్తుంది. ఐసిస్ ఉగ్రవాద చర్యలను ఎవరూ సహించరు. వారి హింసోన్మాదం మితిమీరుతోంది. పవిత్ర రంజాన్ మాసంలో ఉగ్రవాద చర్యలకు పాల్పడుతూ నరమేధం సృష్టిస్తున్నారు. మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ ఉగ్రచర్యలను ఖండించాలి.

**ఎస్.కె.సాబ్జాద్, నెల్లూరు.**




## నారాయణే భరించాలి

నెల్లూరు నగరవాసులకు నాయకుల యుద్ధాలతోనే సరిపోతుంది. నీవు చవట అంటే నీవు వెధవ అనుకుంటున్నారు. ఆనం వివేకా, అజీజ్‌లను కాంగ్రెస్, వైకాపాల నుండి తెచ్చి తెలుగుదేశంలో చేర్చింది నారాయణే! వీళ్లిద్దరి నోర్లను ఎవరూ ఆపలేరు. ఇద్దరూ నెల్లూరు కార్పొరేషన్‌ను అవినీతి మయం చేశారు. నారాయణే వాళ్లిద్దరినీ భరించి అదుపులో పెట్టుకోవాలి.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## అసదుద్దీన్ ఆట కట్టించాలి

ఉగ్రవాద చర్యలకు మద్దతు పలికేలా వ్యవహరిస్తున్న మజ్లీస్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీపై చట్టం, న్యాయ పరంగా చర్యలు తీసుకోవాలి. ఒక ప్రజాప్రతినిధిగా వుంటూ భారత రాజ్యాంగ పరిధిలో కాకుండా ఒక మతాధికారి స్థాయిలో మాట్లాడుతుంటాడు. లౌకిక వాదుల గురించి గట్టిగా మాట్లాడే వామపక్ష, లౌకిక పార్టీల నాయకులు ఇతని ఆగడాలపై నోరెత్తరు.

**సి.రాజీవి, నెల్లూరు.**

## హడావిడి అక్కర్లేదు

పుష్కరాలను పుష్కరాలుగానే జరపండి, వాటిని రాజకీయ ప్రచారాలకు వాడుకోవద్దు. గోదావరి పుష్కరాలను రాజకీయ ప్రచారానికి వాడుకునే 27మంది ప్రాణాలు తీసారు. కృష్ణ పుష్కరాలకు ఆ పొరపాట్లు చేయొద్దు. విస్తృత ప్రచారం అవసరం కూడా లేదు. కోట్లాది మంది భక్తులొస్తే మునగడానికి కృష్ణలో నీళ్లు కూడా లేవు.

**అశోక్, చీరాల.**



# అందరితో గొడవే...!

## ■ దేశం నేతలకు మింగుడుపడని మేయర్ ■

*అతని రాజకీయ అనుభవం గట్టిగా ఐదేళ్ళు... మేయర్‌గా రెండేళ్ళు... కాని ఈలోపే అందరితో గొడవలు పెట్టుకున్నాడు. నెల్లూరు నగరంలో ముఖ్యమైన నాయకులతో పేచీలు పెట్టుకుని నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయిలో వున్నాడు. అతనే నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్.*

2014లో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో వుండి కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్‌గా ఎన్నికయ్యాడు. వైకాపాలో వున్నప్పుడు అతనికి నెల్లూరు నగర ఇన్‌ఛార్జ్‌గా వున్న పి.అనిల్‌కుమార్‌యాదవ్‌తో పడేది కాదు. మేయర్‌గా ఎన్నికయ్యాక మంత్రి నారాయణ ప్రోద్భలంతో వైకాపాను వదిలి తెలుగుదేశంలో చేరాడు. మేయర్‌గా తనతో పాటు వచ్చిన కార్పొరేటర్లకు మాత్రమే ఆయన ప్రాధాన్యతనివ్వడంతో తెలుగుదేశం కార్పొరేటర్లకు మండేది. మెజార్టీ కార్పొరేటర్లు అజీజ్‌కు వ్యతిరేకంగానే వున్నారు. ఇక జిల్లాలో ముఖ్యనాయకుడైన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో అజీజ్‌కు సత్సంబంధాలు లేవు. సోమిరెడ్డి కార్పొరేషన్ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని ఎంతో కాలం నుండి కనిపెట్టుకుని వున్న డాక్టర్ జడ్.శివప్రసాద్‌ను మేయర్ చేయాలని ప్రయత్నించాడు. వైకాపా నుండి వలస వచ్చిన మేయర్‌ను ఆయన ఆమోదించ లేక పోతున్నాడు. ఇక ఆనంతో తారాస్థాయిలో అజీజ్‌కు విభేదాలున్నాయి. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడే కార్పొరేటర్‌గా వున్న ఆనం రంగమయూర్‌రెడ్డి మేయర్‌ను టార్గెట్‌గా చేసుకుని అవినీతి విమర్శలు ఎక్కుపెట్టేవాడు. ఇప్పుడు ఆనం వాళ్లు తెలుగుదేశంలో చేరారు. కొడుకుకు అబ్బ(వివేక) కూడా జత కలిశాడు. అజీజ్ నెత్తిన ఎంత మట్టి పోయాలో అంతకంటే ఎక్కువే పోస్తున్నారు. ఆనం, అజీజ్‌ల మధ్య పోరు ముఖ్యమంత్రి చంద్రబాబు దాకా పోవడం తెలిసిందే! అయినా ఇది ఆగేది కాదు. ఇకముందు కూడా అజీజ్ మీద ఆనం దండయాత్ర ఎప్పుడూ ఉండేదే! నెల్లూరురూరల్ ఇన్‌ఛార్జ్‌గా వున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డికి కూడా అజీజ్ వైఖరి పడుతున్నట్లు లేదు. మేయర్ ఒంటెద్దు పోకడలపై ఆదాల కూడా ఆగ్రహంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

ఇలా పార్టీలోకొచ్చిన రెండేళ్లలోనే నెల్లూరులోని అందరు ముఖ్యమైన నాయకులతో గొడవలు పెట్టుకుని వర్గవిభేదాలకు సరికొత్త రూపంగా నిలిచాడు అజీజ్.

# ఎరువు... తగ్గిన బరువు

- అన్నదాతకు ఊరట
- దిగొచ్చిన యూరియా ధరలు



*కలెక్టర్... కండక్టర్...యాక్టర్... డాక్టర్... లాయర్... లీడర్... టెక్నీషియన్... మెజీషియన్... ఈ ప్రపంచంలో ఎన్నిరకాల వృత్తులున్నా, ఎంతమంది ఎన్ని రకాలుగా పని చేస్తున్నా మొదటి ప్రాధాన్యతనివ్వాల్సిన వృత్తి మాత్రం వ్యవసాయమే! రైతన్న కాడె పడితేనే మిగతా వృత్తులు, వ్యాపారాలకు మనుగడ. ఆ రైతున్న విత్తు నాటకుంటే, పంట పండించకుంటే... మనుషులకు మిగతావాటితో ఏం పని!*

అయితే ఈ సమాజంలో అన్నదాతలకు వున్నన్ని అవస్థలు ఇంకే వృత్తిలోని వారికీ ఉండవేమో! జనం అవసరాలు, సౌకర్యాలను బట్టి మిగతా వృత్తులు సాగిపోతుంటాయి. కాని అన్నదాత పరిస్థితి అలా కాదు. రైతు వ్యవసాయం చేయాలంటే ప్రభుత్వం సహకరించాలి, ప్రకృతి కనికరించాలి. కష్టాలు, కడగండ్ల మధ్య రైతన్న వ్యవసాయం సాగిస్తున్నా ప్రభుత్వాల నుండి అంతంతమాత్రం సహకారం అందుతుంటుంది. ఇక ప్రకృతి ఎప్పుడు కరుణిస్తుందో, ఎప్పుడు ఆగ్రహిస్తుందో చెప్పలేం. దీనికితోడు ఏ ఏడాదికాయేడాది రైతుల పెట్టుబడులు పెరుగుతూనే వున్నాయి. ఈ తరుణంలో రైతన్నకు ఓ మంచి వార్త చెవిన పడింది. కేంద్రప్రభుత్వం చొరవతో ఎరువుల ధరలు భారీగా తగ్గాయి. డిఏపి, ఎంఓపి, కాంప్లెక్స్ ఎరువుల ధరలను భారీగా తగ్గిస్తూ కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి అనంతకుమార్ తీసుకున్న నిర్ణయం రైతుల్లో ఆనందం నింపింది. 50కిలోల డిఏపి బస్తాపై 125 రూపాయలు, ఎంఓపి బస్తాపై 250రూపాయలు, కాంప్లెక్స్ ఎరువు బస్తాపై 50రూపా యలు తగ్గనుంది. ఒక్క నెల్లూరు జిల్లాలోనే ఖరీఫ్, రబీ సీజన్‌లో ఈ మూడు రకాల ఎరువులు కలిపి 58వేల మెట్రిక్ టన్నుల దాకా వాడుతున్నారు. జిల్లాలో 4.5లక్షల మంది రైతులు దాదాపు 10లక్షల ఎకరాలలో వ్యవసాయం చేస్తున్నారు. తగ్గిన ధరలతో రైతులపై ఏడాదికి 14కోట్ల రూపాయల భారం తగ్గనుంది.

# మసీదుల మరమ్మత్తులకు 29 లక్షలు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి నారాయణ

నెల్లూరుజిల్లా వ్యాప్తంగా వున్న మసీదుల మరమ్మత్తులకు రూ.29 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నాడు. నెల్లూరు మెక్లిన్స్ రోడ్డు సమీపంలోని ఖతేజా మసీదులో ఆదివారం ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. మసీదుల్లో పని చేస్తున్న పేష్‌మామ్‌లకు రూ.5వేలు, మౌజర్‌లకు రూ.3వేలు చొప్పున జీతం మంజూరు చేసిందన్నారు. అనంతరం మసీదులో నమాజులు చదివి, ఇఫ్తార్ విందును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఇంతియాజ్, మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కార్పొరేటర్ జలీల్, షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.







## విశ్వవిద్యాలయమా?

# వివాదాల నిలయమా?

## ● ప్రతిరోజూ ధర్నాలు... విద్యార్థి సంఘాల ఆందోళనలే!

*ఏ ముహూర్తాన నెల్లూరులో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయాన్ని మొదలు పెట్టారోగాని మొదటి నుండి వివాదాలు, ఆందోళనలే! యూనివర్శిటీ పాలకవర్గాల వైఖరి మూలంగా ఈ చదువుల క్షేత్రం వివాదాల కురుక్షేత్రంగా మారుతోంది. పుస్తకాలు పట్టి చదువులు బట్టీ పట్టాల్సిన చోట "డౌన్ డౌన్'లు, "వర్ధిల్లాలి' వంటి నినాదాలను వినాల్సి వస్తోంది.*

నెల్లూరులో విశ్వవిద్యాలయం అంటే అభివృద్ధికి అదొక ల్యాండ్‌మార్క్ అనుకున్నాం గాని, ఇలా మున్సిపాల్టీ మురికి నీళ్ల ట్యాంక్‌లాగా మారుతుందనుకోలేదు. రాష్ట్రంలోని ప్రతిజిల్లాను చదువుల పరంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి సీఎంగా వున్నప్పుడు జిల్లాకొక యూనివర్శిటీని మంజూరు చేశారు. 2008లో నెల్లూరు విఆర్ హైస్కూల్‌లో యూనివర్శిటీ తరగతులను మొదలు పెట్టడం తెలిసిందే! కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా వున్నప్పుడు కాకుటూరు వద్ద యూనివర్శిటీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. దాదాపు ఇప్పుడు భవనాలు పూర్తి కావస్తున్నాయి.

ఇది ఒకెత్తయితే యూనివర్శిటి పాలకవర్గ నిర్ణయాలు వివాదాలకు ఆజ్యం పోస్తూ విద్యార్థి సంఘాల ఆందోళనలకు కేంద్ర బిందువుగా మారుతున్నాయి. ఇటీవల యూనివర్శిటీలో కాంట్రాక్ట్ విధానం మీద పని చేస్తున్న 84మంది అకడమిక్ కన్సల్టెంట్స్‌ను ఉన్నఫళంగా తొలగించాలని పాలకవర్గం తీసుకున్న నిర్ణయం పెద్ద దుమారమే రేపింది. ఇంతమంది బ్రతుకుల మీద ఎలా దెబ్బకొడతారంటూ టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘం పెద్ద ఎత్తునే ఆందోళన చేసింది. ఈ విద్యార్థి సంఘం ఆందోళనతోనే ప్రభుత్వం దిగొచ్చి యూనివర్శిటీలో ఈ తాత్కాలిక ఉద్యోగుల తొలగింపును అడ్డుకుంది. 2009లో 84 మంది అకడమిక్ కన్సల్టెంట్స్‌ను కాంట్రాక్ట్‌పై తీసుకున్నారు. ఆరేడువేలతో వారి జీతాలు మొదలై ఇప్పుడు 12 నుండి 15వేలు దాకా ఇస్తున్నారు. తమని పర్మినెంట్ చేయాలని వాళ్లు మొత్తుకుంటున్నా ఎవరూ వారి మొర ఆలకించలేదు. కాగా, ఇప్పుడున్న ఉప కులపతి, రిజిస్ట్రార్‌లు ఏకంగా వారి ఉద్యోగాలకే ఎసరుపెట్టారు. ఉన్నఫళంగా వారిని తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అకడమిక్ కన్సల్టెంట్‌గా కొత్త వారిని తీసుకోవాలని ప్రతిపాదన తెచ్చారు. ఈ విషయంలో రిజిస్ట్రార్ చక్రం తిప్పాడని, ఒక్కో ఉద్యోగానికి లక్షల రూపాయలు వసూలు చేశారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పుడున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు 15వేల జీతం ఇవ్వడానికే నిధులు లేవన్న పాలకవర్గం, కొత్తగా చేర్చుకునే ఉద్యోగులకు మాత్రం పాతిక వేలదాకా జీతాలు ఇస్తామని చెప్పిందని, ఇదెలా సాధ్యమవుతుందని విద్యార్థి నాయకులు ప్రశ్నిస్తున్నారు. అదీగాక కొత్త ఉద్యోగాల విషయంలో రిజిస్ట్రార్ తన సొంత జిల్లా అయిన చిత్తూరుజిల్లా అభ్యర్థులకు పెద్దపీట వేసాడని ప్రధాన ఆరోపణ. ఇప్పుడు ప్రతి జిల్లాలోనూ యూనివర్శిటీలున్నాయి. ఏ యూనివర్శిటీలో ఉద్యోగాలకైనా స్థానిక నిరుద్యోగులకే మొదటి ప్రాధాన్యత ఉండాలి. కాని రిజిస్ట్రార్ తన సొంత జిల్లా అభ్యర్థులను దృష్టిలో పెట్టుకుని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఉద్యోగాలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్త నోటిఫి కేషన్ జారీ చేసాడని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. గతంలోనే రిజిస్ట్రార్ మీద పలు ఆరోపణలు వచ్చాయి. అధికారపార్టీ నాయకులు కూడా దీనిని వైస్‌ఛాన్సలర్ దృష్టికి తీసు కెళ్లారు. ఈ ఆరోపణల మీద ఎంక్వయిరీ చేయిస్తానని వి.సి వారికి చెప్పాడు. ఇంతవరకు అది ఆచరణ రూపం దాల్చలేదు. ఇక యూనివర్శిటీ భవనాల నిర్మాణంలో సైతం లొసుగులు చోటుచేసుకుంటున్నాయని ఆరోపణ. బిల్డింగ్‌ల నాణ్యత పరిశీలన కోసం ఎక్స్‌పర్ట్ కమిటీ సూచించిన మేరకే కాంట్రాక్ట్‌ను నిర్ణయించాలి. కానీ అలాంటివేవీ లేకుండా పైరవీలకు స్థానం కల్పిస్తూ పాలకవర్గం తమ ఇష్టం వచ్చిన రీతిలో భవనాల కాంట్రాక్టులను నిర్ణయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వివాదాలతో గబ్బు పడుతోంది. యూనివర్శిటీలో వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపించి, సరైన పాలకవర్గాన్ని నియమించి, ఈ యూనివర్శిటీని వివాదాలకు కాకుండా విద్యకు కేంద్రంగా మార్చేందుకు జిల్లా ప్రజాప్రతినిధులే చొరవ చూపాల్సి వుంది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# నెల్లూరు కబుర్లు

## వెంకయ్య శాఖల్లో స్వల్ప మార్పు



నెల్లూరీయుడు, కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు నిర్వహిస్తున్న శాఖల్లో స్వల్ప మార్పు జరిగింది. పట్టణాభివృద్ధి మరియు పార్లమెంటరీ వ్యవహారాలు ఇంతవరకు ఆయనే చూస్తున్నారు. 5వ తేదీ కేంద్ర కేబినెట్‌లో జరిగిన మార్పుల్లో వెంకయ్య వద్ద వున్న పట్టణాభివృద్ధి శాఖ అలాగే వుంచి పార్లమెంటరీ వ్యవహారాలను మాత్రం అనంతకుమార్‌కు అప్పగించారు. వెంకయ్యకు కరెక్ట్‌గా సరిపోయే సమాచార, ప్రసారాల శాఖను ఆయనకు ఇచ్చారు. ఇంతకుముందు ఈ శాఖ అరుణ్‌జైట్లీ చూస్తున్నారు.

## అమెరికా పర్యటనలో అనిల్



నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ అమెరికా పర్యటనకు వెళ్లారు. అక్కడ ప్రవాసాంధ్రులు నిర్వహించిన 'ఆటా' వేడుకల్లో కూడా ఆయన పాల్గొన్నాడు. అనంతరం పలు నగరాలలో పర్యటించి ఈ నెల 13న తిరిగి ఇండియాకు రానున్నారు.

## హోంగార్డులకు క్యాంటిన్ కార్డ్సు



హోంగార్డులకు క్యాంటిన్ కార్డులను అందజేస్తున్న జిల్లా ఎస్పీ

నెల్లూరుజిల్లాలో పని చేస్తున్న సుమారు 700 మంది హోంగార్డులకు పోలీస్ సబ్సిడరీ క్యాంటిన్‌లో సబ్సిడరీని వినియోగించుకొనేందుకు గాను సబ్సిడరి కార్డ్సును జిల్లా ఎస్పీ విశాల్ గున్నీ సోమవారం పంపిణీ చేశారు. జిల్లాలో పోలీసులతో సమానంగా శ్రమిస్తున్న హోంగార్డులకు జిల్లాలోనే మొట్టమొదటిసారిగా సబ్సిడరి క్యాంటిన్‌లో అవకాశం కల్పించారు. ఈ కార్డులను జిల్లా ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ బి.శరత్‌బాబు, అడిషనల్ హోంగార్డ్స్ డిఎస్‌పి కె.శ్రీనివాసరావు, ఎస్పీ ఏఆర్ సూరిబాబు, హోంగార్డ్స్ ఆర్ఐ చిరంజీవి, అడ్మిన్ ఆర్ఐ శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వనభారతి - జనహారతిలో రత్నాలు



మొక్కలు నాటుతున్న ఏఎస్పీ శరత్‌బాబు

రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'వనభారతి – జనహారతి'లో భాగంగా మంగళవారం డా॥ కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ స్కూల్స్‌లో భాగమైన డా॥ కిషోర్స్ రత్నం టెక్నో స్కూల్‌లో జిల్లా అదనపు ఎస్పీ శరత్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడవచ్చని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుండి మొక్కలు నాటడం అలవరచుకుంటే పర్యావరణ సమతుల్యానికి ఎంతో దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ డా॥ కృష్ణకిషోర్, వాసంతి కృష్ణకిషోర్, స్కూలు జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్, ఎ.ఓ.రుక్మిణి, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇరుకళలమ్మ మాజీ ఇఓకు సన్మానం



ఆళ్ల శ్రీనివాసులురెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఆలయ చైర్మెన్

మొన్నటి వరకు నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ముఖ్య కార్యనిర్వహణాధికారిగా పనిచేసి, ఈ ఆలయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి ఇటీవలే బదిలీ అయిన ఆళ్ల శ్రీనివాసులురెడ్డిని ఆదివారం రాత్రి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఆలయ చైర్మెన్ మెట్టు సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగగా ఆలయ కమిటి సభ్యులు కూడా ఆయనను సత్కరించారు.

### ఆస్ట్రేలియాలో జరిగే సదస్సుకు
## 'సింహపురి' డాక్టర్



సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియాలోని పెర్త్‌లో జరుగనున్న అంతర్జాతీయ ఏషియన్ పసిఫిక్ కాంగ్రెస్ ఆఫ్ నెఫ్రాలజీ సదస్సుకు నెల్లూరులోని సింహపురి ఆసుపత్రిలో కిడ్నీ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ మాధవ్ దేశాయ్ వెళ్లనున్నారు. యూరిన్ ఇన్‌ఫెక్షన్‌కు సంబంధించిన అంశంపై ఆయన ఆ సదస్సులో ప్రసంగించనున్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల నుండి 600మంది వైద్యులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు. ప్రతిష్ఠాత్మకమైన సదస్సుకు ఆహ్వానం అందుకున్న డాక్టర్ మాధవ్ దేశాయ్‌ని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, సిఏఓ నాగేంద్రలు ఒక ప్రకటనలో అభినందించారు.

## బాధ్యతలు తీసుకున్న బాలాజీ

జిల్లా నూతన క్రీడాభివృద్ధి అధికారిగా బాలాజీ ఈ నెల 4వతేదీ బాధ్యతలు తీసుకున్నారు. చిత్తూరు జిల్లాలో ఖోఖో కోచ్‌గా వున్న ఆయనను నెల్లూరు డిఎస్‌డిఓగా బదిలీ చేసి, ఇక్కడ వున్న యతిరాజ్‌ను ప్రకాశం జిల్లాకు పంపడం తెలిసిందే!

### డిఆర్‌డిఏ
## పి.డిగా లావణ్యవేణి

డిఆర్‌డిఏ పిడిగా లావణ్యవేణిని సంవత్సరం పాటు డిప్యూటేషన్ మీద నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె గతంలో చిత్తూరుజిల్లా సెట్విన్‌లో పని చేశారు.

### నెల్లూరు ఆర్టీసీ
## ఆర్ఎం బదిలీ

నెల్లూరు ఏపియస్ ఆర్టీసీ నెల్లూరు రీజినల్ మేనేజర్ మహేశ్వర్ విజయవాడలోని హెడ్‌ఆఫీసుకు బదిలీ అయ్యారు. ఈమేరకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. విజయవాడ హెడ్ ఆఫీసులో పనిచేస్తున్న రవివర్మ నెల్లూరు రీజినల్ మేనేజర్‌గా బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు. అలాగే నెల్లూరులో డిప్యూటి అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న లక్ష్మీ నారాయణ విజయవాడ హెడ్‌ఆఫీసుకు బదిలీ అయ్యారు. ఏలూరులో పని చేస్తున్న వెంకటలక్ష్మి పదోన్నతిపై డిప్యూటి అకౌంట్స్ ఆఫీసర్‌గా రానున్నారు.

## శేఖర్‌రెడ్డికి జగన్ పరామర్శ

నెల్లూరురూరల్ నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కనుపర్తిపాడుకు చెందిన వెందోటి చంద్రశేఖర్‌రెడ్డి అత్త యద్దల మస్తానమ్మ 2వ తేదీ మరణించింది. సూళ్లూరుపేటకు విచ్చేసిన వై.యస్.జగన్మోహన్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీసుకెళ్లగా, జగన్ స్పందించి వెంటనే ఫోన్ ద్వారా వెందోటి చంద్రశేఖర్‌రెడ్డిని పరామర్శించారు.

## రోశయ్య జన్మదిన వేడుకల్లో నెల్లూరీయులు



గవర్నర్ రోశయ్యను సత్కరిస్తున్న ఎం.ద్వారకానాథ్, శరణ్‌కుమార్, ఇ.సురేష్‌కుమార్, జి.శ్రీకాంత్

ఏపి మాజీముఖ్యమంత్రి, ప్రస్తుత తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య 83వ జన్మదిన వేడుకలను 4వ తేదీ చెన్నైలోని రాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. నెల్లూరు నుండి ఆర్యవైశ్య సంఘం నాయకులు, డిప్యూటి మేయర్ ఎం.ద్వారకానాథ్, సి.హెచ్.శరణ్‌కుమార్, ఇమ్మడిశెట్టి సురేష్‌కుమార్, గాదంశెట్టి శ్రీకాంత్ తదితరులు ఆయన జన్మదిన వేడుకలలో పాల్గొని గజమాలతో సత్కరించారు.



### సాయిబాబా మందిరంలో
## గురుపౌర్ణమి వేడుకలు

నెల్లూరు, ట్రంక్‌రోడ్డు, గాంధీనగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో ఈ నెల 19 నుండి 27వ తేదీ వరకు గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నారు. 19 నుండి 25వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 7గంటలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, అష్టోత్తర సహస్రనామ పూజలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. 25వ తేదీ రాత్రి 7గంటలకు స్వామి వారికి ప్రత్యేక పుష్పాభిషేకం, 26వ తేదీ రాత్రి అంగరంగ వైభవంగా బాబా వారి నగరోత్సవం, 27వ తేదీ మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమాలు జరుగుతాయి. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని బాబా వారి కృపకు పాత్రులు కావాలని మందిరం ఛైర్మెన్ మన్నెం అమర్‌నాథ్‌రెడ్డి కోరుతున్నారు.

## పెరిగిన రంగనాథుడి ఆదాయం



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానం హుండీని ఈ నెల 4వ తేదీ లెక్క పెట్టారు. జనవరి 19 నుండి జూలై 4వ తేదీ వరకు హుండీల ద్వారా 12,85,537 రూపాయలు వచ్చింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ మంచి కంటి సుధాకర్, ఇఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.



## మురళీ ఆర్ట్స్ జోక్సుడే సంబరాలు



అచ్యుతమణిని సత్కరిస్తున్న మురళీ

మురళీ ఆర్ట్స్ జోకింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో జోక్స్‌డే సంబరాలు శింగంశెట్టి మురళీ మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో అతిథులు, నిర్వాహకులు జోక్స్ చెప్పి సభికులను కడుపుబ్బా నవ్వించారు. ఈ సందర్భంగా హాస్యనటులు అచ్యుతమణిని శాలువా, పూలమాలలతో సత్కరించి మొక్కను బహుమతిగా ఇచ్చి ఆశ్రమ ప్రాంగణంలో నాటారు. ఈ కార్యక్రమంలో మురళీ ఆర్ట్స్ జోకింగ్ క్లబ్ అధ్యక్షుడు, టి.వి. ఆర్టిస్టు శింగంశెట్టి మురళీ మోహన్‌రావు, తమ్మినేని పాండు, టి.సరళ తదితరులు పాల్గొన్నారు.

## ఏపిసిసిలో నెల్లూరోళ్ళు



నెల్లూరుజిల్లా నుంచి నలుగురిని పిసిసిలో కార్యదర్శులుగా పిసిసి అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి నియమించినట్లు ఏపిసిసి ప్రధాన కార్యదర్శి రాజా తెలిపారు. వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి, మల్లి నవీన్‌బాబు, కొణిదల మునిగిరీష్, డాక్టర్ ఎ.వైద్యలింగంరెడ్డిలను నియమించినట్లు తెలిపారు. వీరు నెల్లూరుజిల్లా అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య ఆధ్వర్యంలో ప్రజల తరపున పని చేస్తారని ఆయన పేర్కొన్నాడు.

## ఉద్యమంలా... ఉప్పెనలా...
# గడపగడపకి వైయస్సార్ కాంగ్రెస్



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పక్కన ఆనం విజయకుమార్‌రెడ్డి, బి.శ్రీకాంత్‌రెడ్డి, బొబ్బల శ్రీనివాసయాదవ్

ఈ నెల 8వ తేదీ దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి జయంతి నాటి నుండి గడప గడపకు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపట్టనున్నామని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నాడు. ఈ నెల 2వ తేదీన నెల్లూరు దర్గామిట్టలోని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఇంటింటికీ పార్టీ కార్యకర్తలు వెళ్లి తెలుగుదేశం పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ విధంగా విస్మరించిందన్నది పూసగుచ్చినట్లు వివరిస్తారన్నారు. 150 రోజుల పాటు ఒక ప్రజాఉద్యమంలా ఈ కార్యక్రమం సాగుతుందన్నారు.

రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైకాపా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకి వైయస్ఆర్ కాంగ్రెస్ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి బిరుదవోలు శ్రీకాంత్‌రెడ్డి, విప్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు లేబూరు పరమేశ్వరరెడ్డి, మలినేని వెంకయ్యనాయుడు, డా॥ సత్తార్, సలీమ్, పర్వతాల శ్రీనివాసులగౌడ్, పుల్లారెడ్డి, యస్సీ సెల్ అధ్యక్షుడు తాళ్ళూరు సురేష్‌బాబు, యస్‌టి సెల్ అధ్యక్షుడు వెంకటరమణయ్య, బత్తిన శోభన్‌రెడ్డి, కార్పొరేటర్ లక్ష్మి, సునంద తదితరులు పాల్గొన్నారు.

# మర్యాద తెలియని అధికారులు

## - వైసిపి కార్పొరేటర్ల ధ్వజం



నెల్లూరు నగర పాలక సంస్థ అధికారులకు మంచి, మర్యాద తెలియడం లేదని, కనీస ప్రోటోకాల్ పాటించడం లేదని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఫ్లోర్ లీడర్ టి.రూప్‌కుమార్‌యాదవ్ ధ్వజమెత్తాడు. ఈ నెల 4వ తేదీ కార్పొరేషన్ కార్యాలయంలోని డిప్యూటీ మేయర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాలలో జరుగుతున్న కార్యక్రమాలలో అధికారులు అసలు ప్రోటోకాల్ పాటించడం లేదన్నారు. ఇటీవల రామ్మూర్తినగర్ పార్కు ప్రారంభోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకంలో నెల్లూరు ఎంపి పేరు గాని, ఎమ్మెల్యేల పేర్లు గాని లేకపోవడం శోచనీయమన్నారు. అధికారులు పద్ధతి మార్చుకుని ప్రజాప్రతినిధులను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. వైసిపి విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ వివిధ పాఠశాలలకు సంబంధించిన కార్యక్రమాలలో కూడా ప్రతిపక్ష కార్పొరేటర్లకు ప్రాధాన్యతనివ్వడం లేదని ఆరోపించారు.

ఈ సమావేశంలో వైసిపి కార్పొరేటర్లు ఊటుకూరు మాధవయ్య, లేబూరు పరమేశ్వరరెడ్డి, గోగుల నాగరాజు, ఓబిలి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నేరాలను నియంత్రించండి

## • నెల్లూరులో డిజిపి విస్తృత పర్యటన



పెళ్ళకూరు పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డిజిపి జె.వి.రాముడు



పోలీసు కార్యాలయంలోని నీటికొలనులో చేప పిల్లలను వదులుతున్న డిజిపి

ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న రాష్ట్ర డిజిపి జె.వి.రాముడు 4వ తేదీన నెల్లూరు జిల్లాలో విస్తృత పర్యటన జరిపాడు. ఆరోజు తిరుమల నుండి బయలుదేరిన ఆయన పెళ్లకూరులో ఎంతో అందంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మూడేళ్ల వయసులోనే 17అంశాలకు సంబంధించి 200బిట్‌లను రెండు నిముషాల్లో చెప్పి తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్‌లోకి ఎక్కిన పెళ్లకూరు ఎస్.ఐ. రవినాయక్ కుమారుడు భార్గవ్‌కృష్ణ నాయక్‌ను డిజిపి అభినందించారు. అలాగే గూడూరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో అత్యుత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఇక్కడ నుండి నెల్లూరుకు చేరుకున్న డిజిపి దంపతులు నవాబుపేటలో నూతనంగా నిర్మించిన పోలీస్ క్వార్టర్స్‌ను ప్రారంభించారు. ఇక్కడ జరిగిన పూజా కార్యక్రమాలలో పాల్గొని వారు మొక్కలు నాటారు. అలాగే పోలీసు కార్యాలయంలో అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన పబ్లిక్ మైదానాన్ని ప్రారంభించి కొలనులో చేప పిల్లలను వదిలారు. పోలీస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్టాండ్‌ను, జిమ్‌ను డిజిపి ప్రారంభించారు. పోలీసు కార్యాలయంలో పచ్చిక మైదానం ఏర్పాటుకు సహకారం అందించిన కిమ్స్ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ టి.గిరినాయుడును డిజిపి శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

అలాగే నగరంలోని పలు కూడళ్లలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి పోలీసు కార్యాలయంలో వాటిని అనుసంధానంగా ఏర్పాటు చేసిన డ్రాగన్ రూమ్‌ను కూడా డిజిపి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసుగ్రౌండ్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ నేరాలను నియంత్రించేందుకు పోలీసు శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. నెల్లూరు ఎంతో ప్రశాంతమైన జిల్లా అని, పోలీసులు సమర్ధవంతంగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గుంటూరు ఐజి సంజయ్, నెల్లూరు ఎస్పీ విశాల్ గున్నీ, ఏఎస్పీ శరత్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ సూరిబాబు, డిఎస్పీలు, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో సెజ్ రూపశిల్పి

## • రవీంద్ర సన్నారెడ్డికి అభినందనలు



శ్రీసిటీని సందర్శించిన సీతోహ్ చున్‌కుంతో శ్రీసిటి బృందం

పారిశ్రామికవాడలు, నగరీకరణకు సంబంధించిన ప్రణాళికా రచనలో ప్రపంచ ఖ్యాతి గడించిన, సింగపూర్‌లోని సుర్బానా జురాంగ్ కంపెనీ ఉపాధ్యక్షురాలు సీతోహ్ చున్ కుం ఈ నెల 1వ తేదీన శ్రీసిటీలో పర్యటించారు. ఆ కంపెనీ తరఫున శ్రీసిటీ నిర్మాణానికి సంబంధించిన రూపకల్పనలో ఆవిడదే ప్రధాన భూమిక. శ్రీసిటీ ఫౌండేషన్ అధ్యక్షులు రమేష్ సుబ్రహ్మణ్యం ఆవిడకు స్వాగతం పలికి, శ్రీసిటీలోని వివిధ ప్రాంతాలలో ఏర్పరచిన పారిశ్రామిక వసతులను చూపి, విశదీకరించారు.

పర్యటనానంతరం శ్రీసిటీ వ్యవస్థాపక నిర్వాహక సంచాలకులు రవీంద్ర సన్నారెడ్డితో మాట్లాడుతూ కేవలం 7సంవత్సరాల వ్యవధిలో ఇంత పురోభివృద్ధి సాధించినందుకు ఆయనను అభినందించారు. ఇంత బృహత్తర పారిశ్రామికవాడను ఈ స్థాయికి తేవటానికి, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో కనీసం పది, పదిహేనేళ్లు పడుతుండగా, శ్రీసిటీ అనతికాలంలో ఇంత వృద్ధి చెందినందుకు సంభ్రమాశ్చర్యాలు కలుగుతున్నాయని ఆమె అన్నారు.

## శ్రీసిటీలో చైనా ప్రతినిధుల బృందం

చైనాలోని షెజియాంగ్ రాష్ట్రం నుండి విచ్చేసిన పదిమంది సభ్యుల వాణిజ్య సంస్థల ప్రతినిధుల బృందమొకటి ఇటీవల శ్రీసిటీలో పర్యటించింది. హిసేహ్‌చింగ్ టోంగ్ ఈ బృందానికి నేతృత్వం వహించారు. శ్రీసిటీ వ్యవస్థాపక నిర్వాహక సంచాలకులు రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి, పారిశ్రామికపరంగా శ్రీసిటీ సాధించిన ప్రగతిని వివరించారు.

# పొట్టేపాలెంలో రంజాన్ తోఫా పంపిణీ



నెల్లూరురూరల్ పొట్టేపాలెంలో ఈ నెల 3వ తేదీన ముస్లిం సోదరులకు రంజాన్ కానుకగా ప్రభుత్వం అందజేసిన నిత్యావసర వస్తువులను తెలుగుదేశం నాయకులు, శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం ఛైర్మెన్ పొన్నాల రామచంద్రారెడ్డి అందజేశారు. ముస్లింలు రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలనే మంచి ఆలోచనతోనే మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఉచిత కానుకను అందజేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జనార్ధన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పిస్తున్న వినోద్‌రెడ్డి

# ప్రజల నెత్తిన పెనుభారం

నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలకు సంబంధించి జైకా సంస్థ 0.3శాతం వడ్డీకి రుణమిస్తామంటే, అధికార పార్టీ నాయకులు తమ స్వలాభం కోసం నెల్లూరును తాకట్టుపెట్టి ప్రజల నెత్తిన రూ.110కోట్ల భారం మోపారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి మండిపడ్డారు. ఈ నెల 2వ తేదీ నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాల్లో జరుగుతున్న అవినీతిని ఎండగట్టేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగులను తొలగించినా ప్రజా ఉద్యమాన్ని ఆపలేరన్నారు. అధికారపార్టీ అవినీతి, అక్రమాలను గడపగడపకు తీసుకెళ్తా మన్నారు. ఈ కార్యక్రమంలో సంగం షఫి, చంద్రశేఖర్‌రెడ్డి, ఉడాలి సూర్యనారాయణ, మురళీరెడ్డి, కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలి



ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన మహాత్ముడు పూజ్య బాపూజీని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని, ముఖ్యంగా యువత గాంధీజీ ఆశయాల బాటలో నడవాలని ఇందుకూరుపేటలోని పల్లెపాడు పినాకిని ఆశ్రమ నిర్వాహకురాలు గూడూరు లక్ష్మి పిలుపునిచ్చారు. ఇక్కడ నిర్వహిస్తున్న గాంధీ ఫిలాసఫీ కోర్సుల్లో భాగంగా ఈనెల 3న 'బాల్యదశలో గాంధీజీ' అనే అంశంపై ఆమె ప్రసంగించి, గాంధీజీ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. బాల్యదశలో గాంధీజీని కథలు, నాటకాలు బాగా ప్రభావితం చేశాయని, సత్యహరిశ్చంద్ర నాటకం గాంధీజీని మరింతగా ఆకర్షించిందని వివరించారు. గాంధీజీని అందరూ ఆదర్శంగా తీసుకుని సమాజంలో మంచి పౌరులుగా యువత రాణించాలని, దేశ సంక్షేమం కోసం కృషి చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గణేశం కృష్ణారెడ్డి, సుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలకు జిపిఎస్

ఈ నెల నుండే ట్రాన్స్‌పోర్ట్, నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం(జిపిఎస్)ను ఖచ్చితంగా అమర్చుకోవాలని జిల్లా రవాణాశాఖ ఉపకమిషనర్ శివరాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం జిఒ-33, 34లను విడుదల చేసిందని వెల్లడించారు. ట్రాక్టర్లు మరియు ట్రాలీలు, లైట్‌గూడ్స్ వాహనాలను ఇందు నుండి మినహాయించినట్లు పేర్కొన్నారు. జిపిఎస్‌ను అమర్చడం వల్ల ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులను ఎగ్గొట్టి తిరిగే వాహనాలను సులభంగా గుర్తించవచ్చని తెలిపారు.

# మన్యం వీరుడికి నివాళి



విద్యార్థినికి బహుమతినందజేస్తున్న అతిథులు

పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బుజబుజనెల్లూరులోని శ్రీనివాస ఇంగ్లీషు మీడియం స్కూలులో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 119వ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు బి.భవాని నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ సాహసవీరుడు, తెల్లవారి గుండెల్లో నిదురించిన వాడు, పౌరుషాన్ని రగిలించినవాడు అల్లూరి సీతా రామరాజు ఒక్కడేనని ఆయన ధైర్యసాహసాల్ని వివరించారు. సంస్థ అధ్యక్షుడు కె.మురళీ మోహన్‌రాజు సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంది శ్రీనివాసులు, జి.సుభద్రాదేవి, రవి గోగులపల్లి, ఒరుపాటి హరికృష్ణారెడ్డి, స్కూలు కరస్పాండెంట్ ఎన్.వి.సుబ్బయ్య పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# పేదరికానికి చదువే పరిష్కారం

- డా॥ సి.ఆర్.రెడ్డి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న డాక్టర్ సి.రోహిణి, ప్రక్కన క్లబ్ అధ్యక్షులు స్నేహలతారెడ్డి

గూడూరు పట్టణంలోని పూలతోట గిరిజనకాలనీలో వున్న సరస్వతి శిశుమందిరం పాఠశాల విద్యార్థులకు ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యాన పార్య, నోటు పుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. సరస్వతి శిశు మందిరం గౌరవాధ్యక్షుడు డాక్టర్ సి.ఆర్.రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చదువుకొని ప్రయోజకులు కావడం ద్వారా పేదరికం దూరమవుతుందన్నారు. డా॥ సి.రోహిణి మాట్లాడుతూ తామంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత స్థాయిలో ఉన్నామని గుర్తు చేశారు. దాతలు అందించిన సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తకాల పంపిణీకి సంబంధించి డాక్టర్లు సిఆర్ రెడ్డి, సి.రోహిణి రూ.75వేలు, గూడూరు సులోచనమ్మ రూ.15వేలు, చిల్లకూరు ఎంపిటిసి సభ్యురాలు మల్లాబత్తిన జీవని రూ.5వేలు విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు స్నేహలతారెడ్డి, సభ్యులు మైథిలి, దంత వైద్యులు డాక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ ఆఫీసులో

# సందర్శకుల హాల్



సందర్శకుల హాలును ప్రారంభిస్తున్న ఎఓ కోదండరామయ్య

గూడూరు రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎస్.వి.అశోక్‌చక్రవర్తి నాయకత్వంలో గూడూరు తహశీల్దార్ ఆఫీసు ఆవరణంలో సందర్శకుల హాలును హార్డ్‌వేర్ వ్యాపారి ఎస్.వి.శ్రీధర్ తమ తల్లి స్వర్గీయ శారదమ్మ జ్ఞాపకార్థం నిర్మించి ఇవ్వగా డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కోదండ రామయ్య ప్రారంభించారు. ప్రతిరోజూ ఈ ఆఫీసుకు వచ్చే వందలాది అర్జీదారులకు ఈ హాలు అత్యంత ఉపయుక్తంగా వుంటుందని క్లబ్ అధ్యక్షులు అశోక్‌చక్రవర్తి అన్నారు. ఈ హాలును రోటరీ క్లబ్ ద్వారా సమర్పించిన దాత శ్రీధర్ ఔదార్యాన్ని కార్యదర్శి మునిరాజా ప్రశంసించారు.

## రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్

# నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న అతిథులు

గూడూరు పట్టణంలోని రోటరీ భవన్‌లో ఆదివారం రాత్రి రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ మాజీగవర్నర్ విజయేంద్రరావు పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలందించాలని, రోటరీ సేవలను విస్తృతం చేయాలన్నారు. నూతన కార్యవర్గాన్ని అతిథులు ఘనంగా సన్మానించి అభినందించారు. రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడు నాగసూరు గోపాల్‌రావు మాట్లాడుతూ సమాజ వికాస భవనం నిర్మించేందుకు తనవంతు కృషి చేస్తానని ప్రకటించారు. అందరి సహకారంతో విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రోటరీ క్లబ్ కార్యదర్శిగా పి.హరిప్రసాద్, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షులుగా వై.స్నేహలతారెడ్డి, కార్యదర్శిగా పి.పరమేశ్వరిలను ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్మెన్ పొనకా దేవసేన, రొటేరియన్లు ఎస్.వి.అశోక్‌చక్రవర్తి, మునిరాజా, మల్లయ్య, జిలానీ, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, మైథిలి, కె.మునిగిరీష్, సునంద, తదితరులు పాల్గొన్నారు.

# వైజేపి లయన్స్‌కు కొత్త సైన్యం



మాట్లాడుతున్న పాస్టు డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నపరెడ్డి, అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, సి.ఆర్.రెడ్డి తదితరులు

గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఆదివారం రాత్రి వైజేపి లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. 2016-17కు నూతన అధ్యక్షులుగా వి.చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా నాగహరికృష్ణ, కోశాధికారిగా వై.సుబ్రహ్మణ్యంరాజులతో పాటు మరికొంతమంది కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అనంతరం వారిచే ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యఅతిథులుగా లయన్ పాస్టు డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నపరెడ్డి, లయన్ డాక్టర్ సిఆర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు వివిధ రకాల సేవలను అందించడంలో వైజేపి లయన్స్ క్లబ్ ముందంజలో నిలుస్తోందన్నారు. అనంతరం ఇంటర్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించిన మేఘన అనే విద్యార్థినికి పెల్లేటి రామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెంకట్రామిరెడ్డి రూ.40వేల ప్రతిభా అవార్డును అందజేశారు. అలాగే క్లబ్ ప్రతినిధులు వివిధ సేవా కార్యక్రమాలలో డాక్టర్ సి.ఆర్.రెడ్డి, ఎన్వీ రమణయ్య, అమృతవల్లి, జాయింట్ క్యాబినెట్ ట్రెజరర్ లయన్ యంజెవస్ వై.గురునాథం, శ్రీనివాసరావు, ఆర్.వి.రావు, గౌతమ్, రవిశంకర్, విజయ్, ఆ క్లబ్ ప్రతినిధులు మంజులాదేవి, ఎస్ఎల్ఎన్ బాబు, ఎస్ఎల్ఎన్ స్వామి, రామచంద్రారెడ్డి, రామానాయుడు, జగదీష్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు నెల్‌క్యాస్ట్ బ్యాగులు



విద్యార్థులకు బ్యాగులు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న నెల్‌క్యాస్ట్ యాజమాన్యం

గూడూరు నెల్‌క్యాస్ట్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీ మండల పరిధిలోని చవటపాలెం స్కూలు, అదవికాలనీ, దివిపాలెం పాఠశాలలోని 750 మంది విద్యార్థులకు నెల్‌క్యాస్ట్ యాజమాన్యం బ్యాగులు, పుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులు, జామెట్రీ బాక్సులు అందజేశారు. నెల్‌క్యాస్ట్ జనరల్ మేనేజర్ అడ్మినిస్ట్రేషన్ ఎన్.ఎస్.రెడ్డి, జిఎం ఫైనాన్స్ దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ నెల్‌క్యాస్ట్ ఇచ్చిన విద్యాసామగ్రిని సద్విని యోగం చేసుకుని మంచి అభివృద్ధిలోకి రావాలని యాజమాన్యం తరఫున కోరారు. డీజీఎమ్ హెచ్ఆర్ టి.మురళీకృష్ణ, మేనేజర్ పబ్లిక్ రిలేషన్స్ ఆనిమెళ్ళ శివకుమార్, మేనేజర్ సెక్యూరిటీ రామ్మోహన్‌రావు, పిట్టి నాగరాజు, హైస్కూల్ హెడ్మాస్టర్ ఎమ్.పురంధర్‌రాజు, ఎంపిపి స్కూల్ హెడ్మాస్టర్ రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థికపరమైన వత్తిడులున్నా సర్దిచెప్పుకోవాలి గాని, ప్రతిఘటించకూడదు. కొత్త పెట్టుబడులు, క్రయవిక్రయాలు వాయిదా వేసుకొనండి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు ఉద్యోగప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు లభించవచ్చును. మాట నిదానంగా ఉండి తొందరపాటు తగ్గాలి. పనులు నిదానంగా జరుగుతాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అధికారులకు స్థానమార్పులుంటాయి. నిర్మాణ పనులు వేగమందుకుంటాయి. బంధువర్గాల నుండి శుభవార్తలు వింటారు. ఆరోగ్య విషయంలో దృష్టి పెట్టండి. ముఖ్యమైన పత్రాలు, నోటీసులు అందుకుంటారు. ఇంటికి కొత్త వస్తువులను సమకూర్చుకొంటారు. స్వల్ప విమర్శలను ఎదుర్కొనవలసి రావచ్చును. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సంతృప్తికరం.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

సలహాలు, హామీలు ఇచ్చి ఇబ్బందులు పడవద్దు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు లభించగలవు. సభలు, సమావేశాలలో ప్రాముఖ్యతను పొందుతారు. వ్యాపార రంగాలలో ఒడుదుడుకులు, ఇబ్బందులుంటాయి. ఆర్థిక ఇబ్బందులుండినా అధిగమిస్తారు. ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. స్థిరాస్తుల లావాదేవీలందు తొందరపాటు వద్దు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు రుణాలు మంజూరు కాగలవు. ప్రముఖులతో పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. సభలు సమావేశాలలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సామాన్యంగా ఉండి, అదనపు ఖర్చులు తప్పనిసరి కాగలవు. మీ నిర్ణయాలను ఇతరులకు చెప్పి ఒప్పించండి. పరుషంగా వ్యవహరించవద్దు.



### బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 8.7.2016 నుండి
తేది. 14.7.2016 వరకు

ఈ వారము మిథునంలో రవి, కర్కాటకంలో బుధశుక్రులు, సింహంలో గురురాహువులు, తులలో కుజుడు, వృశ్చికంలో శని, కుంభంలో కేతువు, కర్కాటక సింహ కన్య తులా రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 13 బుధవారం శుక్రమౌఢ్యమి సమాప్తి

**ఆషాఢ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 8 | శుక్ర | చతుర్థి | సా॥ గం.2.10వ॥ |
| తేది. 9 | శని | పంచమి | సా॥ గం.2.41వ॥ |
| తేది. 10 | ఆది | షష్ఠి | సా॥ గం.3.43వ॥ |
| తేది. 11 | సోమ | సప్తమి | సా॥ గం.5.09వ॥ |
| తేది. 12 | మంగళ | అష్టమి | సా॥ గం.6.55వ॥ |
| తేది. 13 | బుధ | నవమి | రా॥ గం.8.53వ॥ |
| తేది. 14 | గురు | దశమి | రా॥ గం.10.55వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వాహనాలు నడపడం, యంత్రాలతో పనులందు జాగ్రత్త అవసరం బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. అనవసర వ్యవహారాలలో తల దూర్చకండి. కళా శాస్త్ర క్రీడా రంగాలవారికి గుర్తింపు, అవకాశాలుంటాయి. స్థిరాస్తుల లావాదేవీలు ఆపడం మంచిది. ఋణాల వత్తిడి ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులుండి ఖర్చులు పెరుగుతాయి.

## మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

చేపట్టిన పనులకు ఆటంకాలుంటాయి. హామీలు ఇవ్వకండి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. ఆర్థిక వ్యవహారాలను, కుటుంబ లౌకిక వ్యవహారాలను జాగ్రత్తగా నడపండి. రాశి వారికి ఆశించిన ఆదాయం ఉండదు. ఖర్చులు మాత్రం పెరుగుతాయి. అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. ఆర్థిక పరమగు ఒత్తిడి పెరుగుతుంది. కోర్టు కేసుల వల్ల సమస్యలుండగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఇతరులతో వ్యవహారాలలో అపార్థాలు చోటుచేసుకొనగలవు. ఉద్యోగ బాధ్యతలు పెరుగుతాయి. అనుకోని ప్రయోగాలు, ముఖ్య వ్యక్తుల వల్ల సొంత పనులు ముందుకు సాగడం ఉంటుంది. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్య లోపం కొద్దిగా ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశం ఉన్నది. ఆర్థిక ఇబ్బందులతో సామాన్య సంపాదనతో కష్టపడతారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

బిడ్డల విద్యా వివాహ విషయాలపై దృష్టి పెడతారు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరకగలవు. వ్యాపార ప్రయత్నాలు, కొత్త పెట్టుబడులు ఆపుకొనడం మంచిది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొనండి. వృత్తి జీవనం కలవారికి ఆదాయం సామాన్యంగా ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. ఉద్యోగులకు స్థానమార్పులు, ఉద్యోగార్థులకు అవకాశాలుంటాయి. స్థిరాస్తులు కొనే అవకాశాలు దొరుకుతాయి. సభలు సమావేశాలలో పాల్గొంటారు. అప్పుడప్పుడు పనులందు ఆందోళన ఉండగలదు. ఆరోగ్యం ఫరవాలేదు. ఇతరులకు సలహాలు, ఆర్థిక రూపంలో సహాయపడతారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి, ఆదాయం పెరుగుతుంది. ఇంటా బయటా మీ మాటకు విలువ గుర్తింపుంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ప్రభుత్వ అనుమతులు, ఋణాలు మంజూరు కాగలవు. నష్టాలను కష్టాలను మనోధైర్యంగా ఎదుర్కొంటారు. స్థిరాస్తుల లావాదేవీలకు అవకాశాలుంటాయి. అనుకున్న పనులు సరిగా జరుగవు. వ్యాపారాలందు అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యవసాయ రంగాల వారికి ఇబ్బందులుండి రాబడి తగ్గుతుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ప్రభుత్వ అనుమతులు, ప్రభుత్వ సహాయాలు ఆలస్యం కాగలవు. అధికారులకు స్థానమార్పులు, ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. బాకీలు రావలసినవి నిలబడిపోతాయి. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. మిత్రుల సహకారంతో ఒక పని జరుగుతుంది. ఆర్థిక ఒప్పందాలు, పెట్టుబడులందు జాగ్రత్త అవసరము.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కోర్టు వ్యవహారాలలో అనుకూలత, రావలసిన బాకీలు కొంత వసూలు కావడం ఉంటుంది. వ్యతిరేకించిన బంధువులు దారికొస్తారు. శుభకార్యాలు పెండింగ్‌లో పడగలవు. ఆర్థిక వ్యవహారాలలోను కుటుంబ వ్యవహారాలలో జాగ్రత్త నిర్ణయాలు చేయండి. పనులు ఆలస్యమైనా అనుకున్న రీతిలో సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో రాబడి అభివృద్ధి ఫరవాలేదనిపించగలవు.

# వైకుంఠంలో దేవతల అత్యవసర సమావేశం

శ్రీను గల్పిక

అది వైకుంఠం. మహాలక్ష్మి చేత పాదాలకు మసాజ్ చేయించుకుంటూ శేషపాన్పుపై పవళించి ఉన్న మహావిష్ణువు ఎదురుగా వున్న టీవీలో 'ఆడాళ్ల రాజ్యం' సినిమా చూస్తున్నాడు. అంతలో స్వామీ... స్వామీ... రక్షించండి... రక్షించండి అనే కేకలు వినిపించాయి. చూస్తే అక్కడ వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా, గరుత్మంతుడు, అంకాలమ్మ, పోలేరమ్మ, నూకాలమ్మ, ధర్మరాజు, ఇంద్రుడు, కాలభైరవుడు వంటి దేవతలంతా వున్నారు. వారిని చూసి విష్ణువు... ఏమైంది, అంతా కట్టకట్టుకుని వచ్చారు. శివుడి వరం పొందిన రాక్షసులెవరన్నా మీ మీద దాడులు చేస్తున్నారా, మీ యజ్ఞాలను భగ్నం చేస్తున్నారా? ఆ అసురుడి ఉసురు తీయడానికి స్కెచ్ వేయమంటారా? అని అడిగాడు. దానికి ఇంద్రుడు... ఇప్పుడు భూలోకంలో వున్న క్రూరులతో పోలిస్తే బకాసురుడు, హిరణ్యకశిపుడు, నరకాసురుడు, కంసుడు వంటి రాక్షసులు శాంతిదూతలు లెక్క. మానవతావాదులని కూడా చెప్పొచ్చు. ఇప్పుడు భూలోకంలో రాక్షసులను సైతం భయపెట్టే రక్షకులు ఉగ్రవాదుల రూపంలో తిరుగుతున్నారు. మేమిచ్చింది వారికి భయపడి కాదు. ఎన్నికల సమయంలో మేమున్న ప్రతి గుడికి వచ్చి, ఎంతో భక్తి నటించి ఆంధ్ర ప్రదేశ్‌లో అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు విజయవాడలో మాకు నిలువ నీడ లేకుండా చేస్తున్నాడు అని చెప్పాడు. మీకు నిలువ నీడలేకుండా చేయడమేంటి? అసలేం జరుగుతుందక్కడ, నాకు వెంటనే తెలియాలి? అని విష్ణువు గట్టిగా అడిగాడు. అప్పుడే అక్కడకు వచ్చిన నారదుడు... అక్కడ ఏం జరిగిందో చెప్తును, చూపిస్తాను అంటూ తన ట్యాబ్ తీసి, 'రోడ్‌సైడ్ గాడ్స్' ఫైల్ ఓపెన్ చేశాడు. స్క్రీన్ మీద సీన్లు మొదలయ్యాయి.

అది విజయవాడ. సీఎం చంద్రబాబు, మున్సిపల్ మంత్రి పి.నారాయణ, ఎంపి కేశినేని నాని, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నలు స్వామి బూడిద బాబాను కలిసారు. చంద్రబాబు వుండి... స్వామీ, దేవుడు ఎక్కడ వున్నాడంటారు అని ప్రశ్నించాడు. బూడిదబాబా స్పందిస్తూ... నాయనా, దేవుడు అందులేడు, ఇందు లేడన్న సందేహం వలదు... ఆయన ఎక్కువగా మన హృదయాలలోనే కొలువై వుంటాడని అన్నాడు. మరి మన హృదయాలలో వున్నప్పుడు ఈ గుళ్లు, గోపురాలు దండగ కదా స్వామి, అమాయక భక్తులు ఈ గుళ్లలో దేవుళ్లు వున్నారని చెప్పి తండోపతండాలుగా వస్తుంటారు, వీటన్నింటిని ఇప్పుడే కూలగొట్టిస్తానంటూ ఎంపీ కేశినేని నాని అప్పటికప్పుడు ప్రొక్లెయిన్‌లు, బుల్‌డోజర్లు తెప్పించి దేవాలయాలను కూల్చసాగాడు.

ఈ దృశ్యాలను ట్యాబ్‌లో చూసిన మహావిష్ణువు... ఔరా, రాజకీయ నాయకులారా... మీకు అవసరమైతే మొక్కుతారు, అవసరం తీరాక కాళ్లతో తొక్కుతారా అని మనసులో అనుకుని అప్పటికప్పుడు శివుడు, బ్రహ్మలతో పాటు మిగతా దేవతలందరికీ ఫోన్ చేసి వైకుంఠానికి రమ్మని చెప్పాడు. కొద్ది గంటల్లోనే వాళ్లంతా వైకుంఠం చేరుకున్నారు.

వైకుంఠంలోని గరుడ కాన్ఫరెన్స్ హాల్‌లో దేవతల కార్యవర్గ సమావేశం మొదలైంది. మొదట విజయవాడలో దేవాలయాలు కూల్చిన ఘటనను ఖండిస్తూ బ్రహ్మదేవుడు తీర్మానం ప్రవేశపెట్టగా అందరూ దానిని ఆమోదించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మహావిష్ణువు మాట్లాడుతూ విజయవాడ ఘటనపై మనం సీరియస్‌గా యాక్షన్ తీసుకోవాలి. మనం దయ, కరుణ చూపిస్తే ఈరోజు బెజవాడ, రేపు గుడివాడ... ఇంకోరోజు మధురవాడ... కూల్చుకుంటూనే పోతారు. చివరకు మనకు నిలువ నీడ లేక ఆ బూడిదబాబా చెప్పినట్లు మురికి గుండెల్లో, కుళ్లిపోయిన కిడ్నీల్లో వుండాల్సి వస్తుందన్నాడు. దానికి అందరూ చప్పట్లు కొట్టి అవును, యాక్షన్ తీసుకోవాల్సిందే అని నినాదాలు చేయసాగారు. ఏ రూపంలో యాక్షన్ తీసుకుందాం, ఈ గుళ్లను కూలగొట్టిన వారిని సలసలకాగే నూనెలో వేయించమంటారా... ఇనుప మేకులపై నడిపించమంటారా... లేదంటే ఈమధ్యే యమలోకంలో లేటెస్ట్ శిక్షలు అమలు చేస్తున్నాం. 'శోకం' టీవీలో సతీసావిత్రి కాలం నుండి వస్తున్న సాగుతున్న జీవితాలు' సీరియల్‌ను ఫస్ట్ ఎపిసోడ్ నుండి చూపించమంటారా అని యమధర్మరాజు ఆవేశంగా అడిగాడు. శివుడు కలుగజేసుకుని... యమా, శాంతించు, అన్నిటికీ ఆవేశమే పరిష్కారం కాదు. ముందు దేవాలయాలను కూలగొట్టిన వాళ్లను పిలిచి చర్చలు జరుపుదాం, మనకు న్యాయమైన పరిష్కారం రాకుంటే అప్పుడు తదుపరి కార్యాచరణ ప్రణాళికను అమలు చేద్దామని సలహా ఇచ్చాడు. దాంతో అందరూ ఓకే అన్నారు.

★★★★★

విష్ణుమూర్తి ఆఫీసు ఛాంబర్‌లో శివుడు, బ్రహ్మలు వున్నారు. అప్పుడే భూలోకం నుండి వైకుంఠంలో స్పెషల్ ఫ్లైట్ ల్యాండ్ అయ్యింది. చంద్రబాబు, ఆయన వెనుక నారాయణ దిగారు. నేరుగా ఛాంబర్‌లోకి వెళ్లారు. చంద్రబాబును చూడగానే విష్ణుమూర్తి ఆవేశంగా... మేమంటే మీకు లెక్కలేదా, మా గుళ్లను అలా అడ్డంగా కూలదోయిస్తున్నావని అడిగాడు. అప్పుడు చంద్రబాబు మోకాళ్ల మీద కూర్చుని, రెండు చేతులు జోడించి... దేవా, ఈ నిష్కాగరిష్టుడైన భక్తుడిని మీరు అర్థం చేసుకున్నదింతేనా... నన్నే అపార్థం చేసుకున్నారా... నా భక్తిని అనుమానిస్తున్నారా...? ఇలా పిలిచి అవమానిస్తారా...? అసలు నేను ఆ గుళ్లను ఎందుకు తొలగిస్తున్నానో మీకు తెలుసా? అని ప్రశ్నించాడు? తెలియకనే కదా ఈ తొక్కలో పంచాయితీ అంతా అని దేవేంద్రుడన్నాడు.

అప్పుడు చంద్రబాబు... నేను చెబుతా వినండి... మీ గుళ్లన్నీ ఎక్కడ వున్నాయో చూసారా... మురికి కాలువల పక్కన, ట్రాఫిక్ రద్దీ వున్న రోడ్ల పక్కన... ఈ రోడ్ల మీద వున్న దుమ్మంతా వాహనాల దెబ్బకు గుళ్లల్లోకి చేరుతుంది. అదీగాక వాహనాలు వదిలే కాలుష్యం మిమ్మల్ని కమ్మేస్తుంది. మేమేమో ప్రశాంత వాతావరణంలో ఏ.సి గదుల్లో సేద తీరుతున్నాం. మమ్మల్ని అనుక్షణం కాపాడే మీరేమో దుమ్మూ ధూళిలో ఉంటున్నారు. అందుకనే మీకు ఈ బాధ తప్పించాలనుకున్నాను. నేను కడుతున్న సింగపూర్ అమరావతి రాజధానిలో మీ అందరికీ సింగపూర్ టెక్నాలజీతో మంచి డిజైన్‌తో దేవాలయాలు కట్టిస్తాను, వాటిలో ఏసీ కూడా పెట్టిస్తాను, మంచి మంచి ఉద్యానవనాల మధ్య మిమ్మల్ని ప్రతిష్టించాలనుకుంటున్నాను... ఇందుకోసమే విజయవాడలో గుళ్లు పగల కొట్టించాను. ఇందులో నా తప్పేమైనా వుందా? ఉంటే శిక్షించండి... మీ పట్ల భక్తిభావంతో ఆలోచించిన ఈ పాపాత్ముడిని కఠినంగా శిక్షించండి అని కన్నీళ్లు పెట్టుకున్నాడు. చంద్రబాబు యాక్షన్ ధాటికి దేవతలంతా కరిగిపోయారు. నిన్ను అనవసరంగా అపార్థం చేసుకున్నాం... నువ్వు ముందెళ్లు, ఆ సింగపూర్ రాజధాని సంగతి చూడు అని భుజం తట్టి ఆశీర్వదించారు. వాళ్లు స్పెషల్ ఫ్లైట్ వద్దకు వెళుతుండగా దేవేంద్రుడు నెమ్మదిగా మంత్రి నారాయణ వద్దకు వెళ్లి... ఈ సింగపూర్ అమరావతి రాజధాని ఎప్పటికి పూర్తవుతుంది, ఈ ఏడాదిలో అయిపోతుందంటారా అని అడిగాడు. దానికి నారాయణ... నాకు మాత్రం ఏం తెలుసు... మీరు దేవుళ్లే కదా... భవిష్యత్ తెలిసే వుంటుంది కదా, ఈ శతాబ్దంలో అవుతుందో వచ్చే శతాబ్దంలో అవుతుందో అంజనం వేసి కనుక్కోండని చెప్పాడు. ఆ మాటకు దేవేంద్రుడు కళ్లు తిరిగి క్రిందపడ్డాడు.

# మచ్చలేని నాయకుడు మస్తాన్‌రావు

## ● కావలిలో ఘనంగా బీద జన్మదిన వేడుకలు



రెడ్‌క్రాస్‌లో బిఎంఆర్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న పాస్టర్ ఏసురత్నం తదితరులు

బీదా మస్తాన్‌రావు ప్రజాప్రతినిధులకు ఆదర్శప్రాయుడని ఆయన అడుగుజాడల్లో నాయకులంతా కలిసి కావలి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని క్రిస్టియన్ మైనారిటీ సెల్ టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాస్టర్ మైనంపాటి ఏసురత్నం అన్నారు. ఈ నెల 2వ తేదీ మస్తాన్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో కేక్‌ను కట్‌చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి మస్తాన్‌రావు చేస్తున్న కృషి అమోఘమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, దామిశెట్టి సుధీర్, పన్నీరు మాల్యాద్రి, మైనంపాటి జగదీష్ పాల్గొన్నారు.



## కావలి కబుర్లు

### బీసీ సెల్ ఆధ్వర్యంలో...

రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీదా మస్తాన్‌రావు పుట్టినరోజు సందర్భంగా టీడీపీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు బొంతా శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య చేతుల మీదుగా శనివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బెజవాడ ప్రకాష్‌రావు, దామిశెట్టి సుధీర్‌నాయుడు, సన్నెబోయిన నారాయణ, దుత్తికొండ కిషోర్ పాల్గొన్నారు.

### అయ్యప్పస్వామి గుడిలో ప్రత్యేక పూజలు...

బీదా మస్తాన్‌రావు పుట్టినరోజు సందర్భంగా కావలి అయ్యప్ప స్వామి గుడిలో టీడీపీ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి పాదర్తి నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎక్కల వెంకటసురేష్ మిత్రులు పాల్గొన్నారు.

అఖిల మిత్ర యాదవ్ సమాజ్ ఆధ్వర్యంలో బీదా మస్తాన్‌రావు జన్మదినం సందర్భంగా పెద్దఎత్తున అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సమాధి వెంకటక్రిష్ణ యాదవ్, కొల్లు మధుబాబు యాదవ్, మద్దెబోయిన శేషు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల అభివృద్ధికి తేదేపా కృషి



తోఫాను అందచేస్తున్న మున్సిపల్ ఛైర్మన్ అలేఖ్య

ముస్లిం మైనారిటీల అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య అన్నారు. రంజాన్ పర్వదిన సందర్భంగా ముస్లిం సోదరులకు చంద్రన్న కానుక రంజాన్ తోఫాను బీదా మస్తాన్‌రావు ఆదేశాలమేరకు పలు వార్డులలో పంపిణీ చేశారు. తొలుత మున్సిపల్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తోఫాను అందచేశారు. అదే విధంగా నాల్గవ వార్డులో టీడీపీ నాయకులు ద్రోణాదుల వెంకటరావు, జెనిగర్ల మస్తానయ్య, యారకం శ్రీనివాసులు అందచేయగా.. 5వవార్డులో బొంతా శ్రీనివాసులు, చిలకపాటి శ్రీనివాసులు.. 7వ వార్డులో పాపనబోయిన సురేష్.. 10వ వార్డులో మేడికొండ సుకుమార్, కిరణ్...11వ వార్డులో మైనంపాటి జగదీష్, పర్సు జ్యోతీరాం.. 12వ వార్డులో అక్కిలిగుంట సూర్యప్రకాష్.. 13 వ వార్డులో మస్తాన్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి చేతులమీదుగా రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియచేశారు.

# మురళీధర్‌కు గూడూరు ఫ్యాన్ బాధ్యత



వైకాపా గూడూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జ్‌గా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేరిగ మురళీధర్‌ను నియమించారు. ఈమేరకు పార్టీ అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి 6వ తేదీ ఇడుపులపాయలో గూడూరు నాయకులతో చర్చలు జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఇటీవల తెలుగు దేశంలో చేరాడు. దీంతో అక్కడ ఇన్‌ఛార్జ్‌ను నియమించాల్సి వచ్చింది. పార్టీ సిఇసి సభ్యుడిగా గూడూరు కార్యక్రమాలు ఎల్లసిరి గోపాలరెడ్డి చూస్తున్నప్పటికీ ఇన్‌ఛార్జ్ నియామకం కూడా తప్పలేదు. బత్తిన విజయకుమార్, డాక్టర్ బాలచెన్నయ్యలు కూడా ఇన్‌ఛార్జ్ కోసం ప్రయత్నించారు. అయితే మేకపాటి రాజమోహన్‌రెడ్డి అనుచరుడైన మేరిగ మురళీధర్‌ను ఎంపిక చేశారు. మురళీధర్ గతంలో పార్టీ జిల్లా కన్వీనర్‌గా కూడా పనిచేసి వున్నాడు.



ఇస్కాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన గూడూరులో జరిగే జగన్నాథ రథయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఈ నెల 6వ తేదీన గూడూరులో విడుదల చేస్తున్న నెల్లూరు ఇస్కాన్ ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ శుకదేవస్వామి, రాజశేఖర్‌ప్రభు, మయూరి శ్యాంయాదవ్, కట్టా మురళీకృష్ణ

## రోటరీ డిస్ట్రిక్ట్ సెక్రటరీగా రాఘవేంద్రశెట్టి



రోటరీ డిస్ట్రిక్ట్ సెక్రటరీగా రాఘవేంద్రశెట్టిని నియమించారు. ఈయన 2016 జూలై నుండి 2017 జూన్ వరకు బాధ్యతలు నిర్వహిస్తారు. గతంలో రాఘవేంద్రశెట్టి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్‌గా, రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్‌గా విజయవంతంగా బాధ్యతలు నిర్వహించి రోటరీ ఇంటర్నేషనల్ వారిచే ఉత్తమ అధ్యక్షునిగా, ఉత్తమ అసిస్టెంట్ గవర్నర్‌గా అవార్డులు పొందారు. నెల్లూరులో ప్రతిష్టాత్మకంగా పెన్నానది ఒడ్డున నిర్మించే రోటరీ శ్మశాన వాటిక ఛైర్మన్‌గా రాఘవేంద్రశెట్టి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# వంశీ కుటుంబానికి మాగుంట శరత్‌చంద్రారెడ్డి చేయూత



లారీ ప్రమాదానికి గురై నిస్సహాయ స్థితిలో వున్న నెల్లూరు హెచ్‌కెబాబు నగర్‌లోని ఆటోడ్రైవర్ వంశీ కుటుంబానికి ఈనెల 7వతేదీన మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి అధ్యక్షుడు మాగుంట శరత్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో 17వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. శరత్‌చంద్రారెడ్డి, అతని మిత్రుడు లేకిన్‌రెడ్డి మరియు ఇంకొంతమంది మిత్రులు ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. భవిష్యత్‌లో కూడా ఆ కుటుంబానికి అండగా నిలబడతామని ఈ సందర్భంగా శరత్‌చంద్రారెడ్డి పేర్కొన్నాడు.

అలాగే నెల్లూరు డికెడబ్ల్యు కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ చదువుతూ జాతీయ అథ్లెటిక్స్‌లో మొదటి స్థానం సాధించిన సుప్రియకు మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి వారు డ్రై ఫ్రూట్స్, డ్రస్సింగ్ అందజేశారు.

# విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



సేవాభారతి ట్రస్ట్ ఛైర్మన్ బండి ఆదినారాయణరెడ్డి సౌజన్యంతో వారి తండ్రి, రాపూరు మాజీఎంపిపి బండి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రాపూరులోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 650మంది విద్యార్థులకు, బాలికల ఉన్నత పాఠశాలలో 500మంది విద్యార్థినులకు యూనిఫామ్‌లు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో కె.వి.రత్నం, డి.పాపయ్య, జడ్పీటీసీ శకుంతలమ్మ, డాక్టర్ ఖాదర్‌బాషా, ఎంపిడిఓ, ఎస్ఐ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోలీస్‌స్టేషన్‌లో ఇఫ్తార్!



ఈ నెల 5వ తేదీ రాత్రి నెల్లూరులోని 1వ నగర పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ హాజరయ్యారు. 1వ నగర సిఐ అబ్దుల్ కరీం ఈ విందు ఏర్పాటు చేయగా ఎస్పీతో పాటు ఏఎస్పీ శరత్‌బాబు, నగర డిఎస్పీ జె.వి.రాముడు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ కోటారెడ్డి, సి.ఐ మాణిక్యరావు, హైదరాబాద్ లైట్‌హౌస్ అధినేత రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల గూడూరులో జరిగిన స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకల్లో పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం అనంతరం మాట్లాడుతున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ పొనకా దేవసేన, రోటరీ అధ్యక్షులు ఎన్.గోపాలరావు, కె.మునిగిరీష్, సిఐ సుబ్బారావు తదితరులు

# ఆలయాల తొలగింపు సరికాదు



సురేంద్రరెడ్డి

విజయవాడలో దేవాలయాలను తొలగించడం సరికాదని, ఈ విషయంలో ప్రభుత్వం తీరు సక్రమంగా లేదని బిజెపి జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆలయాల కూల్చివేతలో ప్రభుత్వం అవలంభించిన చర్యలతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పొరపాటును సరిదిద్దుకుని ఆలయాలను పునర్నిర్మించాలని తాము కోరగా, అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఈనెల 9న జిల్లాస్థాయి సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నగరశాఖ అధ్యక్షుడు మండ్ల ఈశ్వరయ్య, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు మొగరాల సురేష్, నాయకులు రాజేష్, బండారు శ్రీనివాసులు, కాయల మధు, నరసింహులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సూక్ష్మ నమూనాతో రంజాన్ శుభాకాంక్షలు



నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు డా॥ షేక్ ముసవ్వీర్ గతంలో వెండి, స్వర్ణంతో అనేక సూక్ష్మ రూపాలను తయారుచేసి అందరి మన్ననలు పొందాడు. ఈసారి రంజాన్ పండుగ సందర్భంగా 500మి.గ్రా బంగారంతో ముస్లిం సోదరులు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుని ఆలింగనం చేసుకుంటున్న నమూనాను తయారు చేసి ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశాడు.

# వ్యాపారస్తులకు శుభవార్త

ఆంధ్రప్రదేశ్‌లోని రిటైల్ వ్యాపారస్తులు 365రోజులు దుకాణాలు తెరచి వ్యాపారాలు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ప్రిన్సిపల్ సెక్రటరీ జీవో ఎంఎస్ నెం.26ను విడుదల చేశారని ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు కె.వి.చలమయ్య తెలిపారు. ఈ ఉత్తర్వులు అయిదు సంవత్సరాలు అమలులో ఉంటాయని, గుమస్తాలుగా వున్న వారికి వారాంతపు సెలవులు ఇవ్వాలని, శెలవు రోజుల్లో పనిచేస్తే రెట్టింపు వేతనం ఇవ్వాలని తెలిపారు. ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోరిక మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినందుకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కార్మికశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.


## కాలధర్మం

## కె.వి.సుబ్బారెడ్డి



నెల్లూరు మాజీశాసనసభ్యులు కె.వి.సుబ్బారెడ్డి(84) ఈ నెల 2వ తేదీన స్వర్గస్తులయ్యారు. ఆయనకు ఒక కుమార్తె వున్నారు. స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి అనుచరుడిగా రాజకీయాలలోకి ప్రవేశించిన ఆయన 1967లో నెల్లూరు మున్సిపాల్టీలో ఆల్డర్‌మెన్(ఇప్పటి కో-ఆప్షన్ సభ్యులు)గా ఎన్నికయ్యారు. 1978లో జరిగిన ఎన్నికల్లో తొలిసారిగా నెల్లూరు నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1983లో కాంగ్రెస్ అభ్యర్థిగానే పోటీ చేసి ఎన్టీఆర్ ప్రభంజనంలో ఓటమి పాలైనా తిరిగి రెండేళ్లకే 1985లో జరిగిన ఎన్నికల్లో మళ్ళీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1989లో నాలుగోసారి నెల్లూరు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పొందారు. పదేళ్ల పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా సమర్ధవంతంగా పని చేశారు. తన రాజకీయ జీవితంలో అందరిలోనూ వివాదరహితుడిగా, పదిమందికి మంచి చేసే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## దబ్బల రాజారెడ్డి



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కేంద్ర కార్యనిర్వాహక కమిటి సభ్యుడు దబ్బల రాజారెడ్డి ఈ నెల 1వ తేదీ కన్నుమూశారు. ఆయన వయసు 55సంవత్సరాలు, భార్య, కుమార్తె వున్నారు. గత కొంత కాలంగా ఆయన కిడ్నీలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఈ నెల 2వ తేదీన వైయస్సార్ కాంగ్రెస్ అధినేత వై.యస్. జగన్మోహన్‌రెడ్డి సూళ్లూరుపేటలోని దబ్బల రాజారెడ్డి ఇంటికొచ్చి ఆయనను కడచూపు చూసి నివాళులర్పించారు. రాజారెడ్డి మొదటి నుండి దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి అభిమానిగా ఉండేవాడు. కాంగ్రెస్‌పార్టీలో పలు పదవులు నిర్వహించారు. వై.యస్. మరణం తర్వాత జగన్ వెంట నడిచాడు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో పార్టీకి అతనే పెద్దదిక్కు అయ్యాడు. 2014 ఎన్నికల్లో సూళ్లూరుపేట అభ్యర్థి కిలివేటి సంజీవయ్య గెలుపు కోసం కృషి చేశారు. రాజారెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తూ... వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# విద్యార్థులకు లయన్స్ క్లబ్ పుస్తకాలు




విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గూడూరు మండలంలోని రామలింగాపురం పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 80మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామలింగాపురం సర్పంచ్ సీతమ్మ పాల్గొని మాట్లాడుతూ దాతలు ఇస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు జి.చంద్రశేఖర్, కడివేటి చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయులు గురవయ్య, స్థానికులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ల కొట్లాట

ఈ నెల 5వ తేదీన నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇద్దరు కార్పొరేటర్లు ఘర్షణకు దిగారు. ప్రోటోకాల్ వివాదమే దీనికి ఆజ్యం పోసింది. ఇటీవల రామ్మూర్తినగర్‌లోని ఓ పార్కు ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందంటూ నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్‌కు రాసిన లేఖను వైసిపి ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్ తీసుకెళ్లి కమిషనర్ వెంకటేశ్వర్లుకు ఇచ్చారు. రూప్‌తో పాటు మరో ముగ్గురు వైకాపా కార్పొరేటర్లు కూడా వెళ్లారు. కమిషనర్‌తో వీళ్లు మాట్లాడుతున్న సమయంలో అక్కడే వున్న తెలుగుదేశం కార్పొరేటర్ రాజానాయుడు కలుగజేసుకుని ఏదో మాట్లాడాడు. ఇక్కడ రూప్‌కు రాజాకు మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. అక్కడేవున్న కార్పొరేటర్లు ఇరువురికీ సర్ది చెప్పారు.

# చంద్రుడి చాణక్యం

(మొదటి పేజీ తరువాయి)

అసలు పట్టించుకుని వుండేవాడు కాదు. కాని బీజేపీ, హిందూ సంస్థల తరఫున కాపు నాయకులు ముందు నిలబడడం చంద్రబాబుకు కొత్త తలనొప్పి తెచ్చింది. అసలే గుడులను కూల్చడం సెంటిమెంట్ సమస్య, దానికి కులం తోడయ్యింది. విజయవాడలో కాపు నాయకులకు, కమ్మ నాయకులకు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. అది ముదిరితే క్షణాలలో కాపు, కమ్మల ఘర్షణ రాష్ట్రమంతటా పాకే అవకాశముంది. అసలే కాపు రిజర్వేషన్‌ల విషయంలో ముద్రగడ పద్మనాభం చేస్తున్న ఆందోళనలతో చంద్రబాబుకు నిద్రపట్టడం లేదు. కాపుల్లో చంద్రబాబు పట్ల వ్యతిరేకత మొదలైంది. అవకాశం చిక్కినప్పుడల్లా ప్రతిపక్ష వైకాపా కూడా ఈ రెండు కులాల మధ్య ఎడబాటుకు తనవంతు సహకారం అందిస్తూనే వుంది. దాదాపు 27ఏళ్ల క్రితం హత్యకు గురైన వంగవీటి రంగా వర్ధంతిని ఇంతకుముందెన్నడూ లేని రీతిలో ఈ ఏడాదే ఘనంగా జరిపారు. ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వమే మన రంగాను హత్యచేసిందన్న విషయాన్ని మళ్ళీ కాపులందరికీ గుర్తు చేసే ప్రయత్నం జరిగింది. 2014ఎన్నికల్లో తెలుగుదేశం కాపుల మద్దతుతోనే అధికారంలోకి వచ్చింది. మారిన పరిస్థితులలో తెలుగుదేశంకు కాపుల మద్దతు తగ్గిందనే చెప్పొచ్చు. అది ఇంకా ముదిరితే రాజకీయంగా చాలా నష్టమని భావించిన చంద్రబాబు, విజయవాడ విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి చేసిన పొరపాటును కొంతవరకు సరిదిద్దుకున్నారు. దేవాలయాల కూల్చివేతపై కమిటీ వేసి అందులో బీజేపీకి చెందిన ఇద్దరు మంత్రులను చేర్చడమే కాకుండా దేవాలయాల పునర్నిర్మాణానికి హామీ ఇచ్చారు. బీజేపీ వైపు ముందుండి నడిచిన కాపు నేతలను శాంతింపజేసి తన పార్టీ పరంగా నష్ట నివారణ చర్యలు తీసుకున్నాడు.


## వైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

2016-17 సంవత్సరానికి గాను 10వ తరగతి, ఇంటర్ సెకండ్ ఇయర్ చదివే ఆర్యవైశ్య విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నట్లు కారంశెట్టి వెంకట్రామయ్య ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ కారంశెట్టి వెంకట్రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వారి మార్కుల లిస్టులను లక్ష్మి ఇంజనీరింగ్ కంపెనీ, కనక మహల్ సెంటర్, నెల్లూరుకు ఈ నెల 16వ తేదీలోగా పంపాలని కోరారు. ఇతర వివరాలకు 0861-2324156 నెంబరులో సంప్రదించాలని కోరారు.

## విద్యార్థులకు పలకలు

నెల్లూరుజిల్లా ముస్లిం యూత్ సేవా కమిటి ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ జెండావీధిలోని ఉర్దూ పాఠశాల విద్యార్థులకు పలకలు, నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 1వ నగర సిఐ కరీం పాల్గొని యూత్ సేవ కమిటిని అభినందించారు. కార్యక్రమంలో మున్న, ఆలీమ్, అల్తాఫ్, ఫజల్, అబుజార్, అఫ్జల్, సోహెల్, అబ్దుల్ గయాజ్, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

## జూలై 8 డా॥ రాజశేఖరరెడ్డి 67వ జయంతి సందర్భంగా...



సాకి – WE LOVE YOU
WE MISS YOU
WE LOVE YOU FOREVER
WE LOVE YOU FOREVER

పల్లవి – యాడబోతివిరో రాజన్న !
యాడబోతివిరో !
ఎద ఎదల నుండి
మది మదిల పిండి
యాడబోతివిరో రాజన్న !
యాడబోతివిరో !!

చరణం

1. శ్రితజన పాలకా !
ఆశ్రిత జన నాయకా ॥ 2 సార్లు ॥
ఆపన్నుల వరదాయకా !
అందరిని వదిలి ॥ పల్లవి ॥

2. అపర కాటన్ దొరవి
అనిశము నవ్వుల దొరవి ॥ 2 సార్లు ॥
ఆ పువ్వుల నవ్వులు వదిలి ॥ పల్లవి ॥

3. ఆడపడుచుల ఆశా దీపానివి
అభాగ్యుల అమృత హృదయానివి ॥ 2 సార్లు ॥
అనాథల వదిలి ॥ పల్లవి ॥

4. అతుకు బతుకులకు
మెతుకు పెట్టిన అన్నవురో !
అడవి అన్నలలో పెద్దన్నవురో !
అడవి బిడ్డల వదలి ॥ పల్లవి ॥

5. పేద సాదల పించన్ల దేవుడవు
అనాథ రోగుల ఆరోగ్య దేవుడవు ॥ 2 సార్లు ॥
పేద సాదల వదిలి ॥ పల్లవి ॥

6. జన జీవన జల ప్రదాతవు
జన జీవనోపాధి విధాతవు ॥ 2 సార్లు ॥
జన వాహిని వదిలి ॥ పల్లవి ॥

7. మనుషులలో మహోన్నత మూర్తివి
సగటు మనుషుల చేయూత ఆర్తివి
మట్టి మనుషుల 'మరో మార్పు'వి ॥ 2 సార్లు ॥
మా అందరిని వదిలి ॥ పల్లవి ॥

రచన : డా॥ రాచపాళెం రఘు
ఉపకార్మిక కమిషనర్, వై.యస్.ఆర్.జిల్లా.

# అసలైన లీడర్... శ్రీధర్



వంశీని పరామర్శిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ప్రజాప్రతినిధులంటే బినామీ పేర్లతో కాంట్రాక్టులు చేసేవారు కాదు... ఉద్యోగుల బదిలీల కోసం లంచాలు మింగేవాళ్ళు కాదు... ప్రభుత్వ నిధులతో సొంత పనులు చేసుకునేవాళ్ళు కాదు. లీడర్ అంటే... ప్రజల కోసం బ్రతకాలి, ప్రజల కోసం నడవాలి, అనుక్షణం ప్రజల కోసం తపించాలి. ఇప్పుడున్న రాజకీయాలలో ఈ కోవలో చూస్తే... ఈ లక్షణాలున్న నాయకులు చాలా తక్కువుగా కనిపిస్తారు. అలాంటి వారిలో నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒకరు.

అధికారపార్టీలో లేకున్నా, కాంట్రాక్టర్, పారిశ్రామికవేత్త, వ్యాపారవేత్త కాకపోయినా తనకు సాధ్యమైన స్థాయిలో తన నియోజకవర్గ ప్రజల కోసం తపన పడుతున్నాడు. ఇటీవల లారీ ప్రమాదానికి గురై ఏ పనీ చేసుకోలేక జీవచ్ఛవంలా వున్న ఆటో డ్రైవర్ వంశీకి ఆయన తన జీతం నుండి లక్ష రూపాయలను అందజేస్తానని, ప్రతి నెల 5వేల వంతున 20నెలల పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 6వ తేదీన నెల్లూరు, కొత్తూరు హెచ్.కె.బాబు నగర్‌లోని వంశీ ఇంటికి వెళ్ళి వంశీని పరామర్శించారు. అలాగే వంశీకి వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రఘురామయ్యను, అతని పిల్లలకు ఉచితంగా విద్యనందిస్తున్న వేళాంగణి స్కూల్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. వంశీ సతీమణికి కుట్టుమిషన్ తీసిస్తానని భరోసా ఇచ్చాడు.

# 'దేశం'లో పదవుల గోల



- కిలారికి గ్రంథాలయ కిరీటం
- అనూరాధకు దక్కనున్న పదవి
- రేస్‌లో దేశాయిశెట్టి, పెళ్ళకూరు, కోటంరెడ్డి









**తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ కన్వీనర్ కిలారి వెంకట స్వామినాయుడుకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ పదవి దక్కింది. ఈమేరకు ఆయనకు పార్టీ మహారాజు చంద్రబాబు, యువరాజు లోకేష్‌ల ఆశీస్సులు లభించాయి. సొర చేపకు గాలం వేస్తే పిత్తపరిగ పడినట్లు కిలారికి ఈ పదవి దక్కింది.**

2014 ఎన్నికల్లో నెల్లూరురూరల్ సీటు కోసం ఆయన ప్రయత్నించాడు. అయితే పొత్తులో భాగంగా ఆ సీటును బీజేపీకి వదిలేయడం జరిగింది. ఆ తర్వాత రూరల్ ఇన్‌ఛార్జ్‌గా ఉంటూ పెత్తనం చెలాయిద్దామనుకుంటే, దానిని ఆదాల ప్రభాకర్‌రెడ్డికి అప్పగించారు. పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి కనీసం నెల్లూరు ఆర్టీసీ రీజియన్ ఛైర్మెన్ పదవన్నా ఇమ్మని చాలారోజుల నుండి మొత్తుకుంటున్నాడు. అయితే ఆర్టీసీ విభజన ఇంకా పూర్తి కానందున ఆ పదవిని ఇవ్వలేమని చెప్పి, జిల్లాలో ఎవరూ పెద్దగా డిమాండ్ చేయని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ పదవిని మాత్రం కట్టబెట్టారు. దీనికి నిధులు, విధులు పెద్దగా లేకపోయినా పుస్తకాలు, ప్రోటోకాల్ మర్యాదలు దండిగా ఉంటాయి.

## సమన్వయం లేకుండానే...

అయితే కిలారి ఎంపిక కేవలం మంత్రి నారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ప్రమేయంతోనే జరిగినట్లు తెలుస్తోంది. ఇది జిల్లా స్థాయి పదవి. జిల్లాలో సమన్వయ కమిటీ సభ్యులతో పాటు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌ల ఆమోదం కూడా తీసుకుని వుండాలి. అయితే వీళ్లెవరి అభిప్రాయాలు తీసుకోలేదు. దీంతో మిగతా నాయకులంతా కూడా ఈ ఎంపిక పై మనస్థాపానికి గురైనట్లు తెలుస్తోంది.

## బి.సి, దళితులకు మొండిచేయేనా?

జిల్లా నుండి మరో నలుగురికి త్వరలో నామినేటెడ్ పదవులు దక్కే సూచనలున్నాయి. వీరిలో తాళ్లపాక అనూరాధ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, దేశాయిశెట్టి హనుమంతరావుల పేర్లున్నాయి. అనూరాధకు స్త్రీ శిశు సంక్షేమశాఖలో రాష్ట్రస్థాయి పదవి ఇవ్వనున్నారు. అలాగే కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి రాష్ట్ర స్థాయి పదవి ఇవ్వాలని బాలకృష్ణ పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు కోవూరు నియోజకవర్గంలో పార్టీ కేడర్‌కు అండగా నిలిచిన పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి పేరు కూడా నామినేటెడ్ పదవికి పరిశీలనలో వుంది. ఇక రెండుసార్లు పట్టభద్రుల నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా పోటీచేసి ఆర్ధికంగా నష్టపోయిన దేశాయిశెట్టి హనుమంతరావుకు కూడా నామినేటెడ్ పదవి దక్కొచ్చు. అయితే వీరంతా అగ్రవర్గాలవారే!

పార్టీలో దళితులు, మైనార్టీలు, బలహీనవర్గాల నాయకులు కూడా వున్నారు. అగ్రవర్ణాల నాయకులతో పాటు వీళ్లు కూడా పార్టీ కోసం కష్టపడుతున్నారు. అయితే తొలిదశ నామినేటెడ్ పదవుల్లో ఈ వర్గాల నాయకులెవరి పేర్లు పరిశీలనలో లేనట్లు తెలుస్తోంది. దీనిపై ఈ వర్గాల వారిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

# కార్పొరేట్ హాస్పిటల్స్‌లో అవకాశం కల్పించండి

నెల్లూరుజిల్లాలోని పోలీసు సిబ్బందికి కార్పొరేట్ హాస్పిటల్స్‌లో సౌకర్యం కల్పించాలంటూ ఈ నెల 4వ తేదీన ఏపి పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు రాష్ట్ర డిజిపి జె.వి.రాముడుకు వినతిపత్రం సమర్పించారు. గతంలో చెన్నైలోని కార్పొరేట్ హాస్పిటల్స్ అపోలో, విజయ, గ్లోబల్ ఆరోగ్య భద్రతలో ఉండేవని, ఈమధ్యకాలంలో అవన్నీ తప్పుకోవడం జరిగిందన్నారు. అప్పటినుండి నెల్లూరుజిల్లా పోలీసు సిబ్బంది కార్పొరేట్ హాస్పిటల్స్ లేక అసౌకర్యానికి గురౌతున్నారన్నారు. దయ ఉంచి వీలైనంత త్వరగా కొత్త హాస్పిటల్స్ తనిఖీ చేయించి ఆరోగ్య భద్రతలోకి తీసుకురావాలని వారు కోరారు. అసోసియేషన్ సభ్యులు వరప్రసాద్, శ్రీనివాసులు, పెంచల్‌ప్రసాద్, లక్ష్మీపతి, రమణయ్య, నరసయ్య పాల్గొన్నారు.



డిజిపి జె.వి.రాముడుకు వినతిపత్రం అందజేస్తున్న పోలీసు సంఘం నాయకులు

# స్వచ్ఛగ్రామాలతోనే స్వచ్ఛభారత్



వృద్ధురాలిని పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్ యం.జానకి

జిల్లాలో 100శాతం మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తిచేసి స్వచ్ఛభారత్‌లో కావలి మండలం, రాజువారి చింతలపాళెం గ్రామం ముందంజలో వుందని, బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దడంలో గ్రామస్తులందరూ చొరవ చూపడం మంచి పరిణామమని జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి అన్నారు. బుధవారం కావలి మండలం రాజువారి చింతలపాళెం గ్రామంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛభారత్ సభలో ఆమె పాల్గొని మాట్లాడుతూ నెల్లూరుజిల్లాలో మొట్టమొదటి 100శాతం మరుగుదొడ్లు పూర్తి చేసిన ఘనత రాజువారి చింతలపాళెం గ్రామానిదేనని అన్నారు. బెల్టుషాపుల నియంత్రణలో కూడా గ్రామస్తులు ఎంతో చొరవతో ముందుకు వచ్చి నియంత్రించుకోవడం అభినందనీయ మన్నారు. రాజువారి చింతలపాళెం గ్రామంలో త్రాగునీటి విషయంలో, ఎల్ఇడి వీధి దీపాల ఏర్పాటు విషయంలో ఎంతో చొరవచూపి జిల్లాలోకెల్లా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దిన సర్పంచ్ మల్లిఖార్జున కృషిని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా పొంకు సుబ్బమ్మ అనే 95ఏళ్ల వృద్ధ మహిళను కలెక్టర్ పరామర్శించి పింఛను, రేషన్‌కార్డులను త్వరితగతిన అందించే విధంగా అధికారులను ఆదేశించారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com